RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 4 పేజీలు - 8
సంచిక (Issue) : 352 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

బుధవారం 17, మే 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## నేడు బిఆర్ఎస్ సమావేశం

**తాజా పరిణామాలపై కెసిఆర్ చర్చ**

హైదరాబాద్,మే16(ప్రజా మంటలు) : కర్నాటక ఎన్నికల ఫలితాలు రాష్ట్రంపై ప్రభావం చూపుతాయన్న ప్రచారం మధ్య బుధవారం బిఆర్ఎస్ లెజిస్లేచర్, ఎంపిల సమావేశం జరుగనుంది. వచ్చే తెలంగాణ ఆవిర్భావ దశ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు అంశాలను చర్చించనున్నారు. నేతలను సన్నద్ధం చేయడంతో పాటు తెలంగాణ విజయాలను ప్రజల్లోకి మిగతా... 2లో



## తెలుగు రాష్ట్రాల్లో...

# మండుటెండలు

- గరిష్టంగా 45 డిగ్రీల వరకు నమోదు
- ఎండల భయంతో జనం ఇళ్లకే పరిమితం
- మరో మూడు రోజులు ఇదే పరిస్థితి అన్న వాతావరణ శాఖ



హైదరాబాద్,మే16(ప్రజా మంటలు) : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండుతున్నాయి. మరో మూడునాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉండేలా ఉంది. రాగల మూడు రోజులు రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.దిగువ స్థాయిలోని గాలులు వాయవ్య దిశ నుంచి రాష్ట్రం వైపు వీస్తున్నాయని అధికారులు వివరించారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిన ఉష్ణోగ్రతలతో జనం హడలిపోతున్నారు. ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. మూగజీవాలు ఎండవేడిని తట్టుకోలేక అల్లాడుతున్నాయి. మధ్యాహ్న వేళలో జనం ఇండ్లకే పరిమితం అవుతుండటంతో రోజువారీ వ్యాపారాలు కుదేలవుతున్నాయి. రాష్ట్రంలో మరో మూడు రోజులు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. హైదరాబాద్ దాని చుట్టపక్కల జిల్లాలలో పగటి ఉష్ణోగ్రతలు 38 నుంచి 41 డిగ్రీలు వరకు నమోదయ్యే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. వాయవ్య దిశ నుంచి తెలంగాణ వైపు వీస్తున్న గాలుల ప్రభావంతో ..పలు జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మంచిర్యాల, నిజామాబాద్, కుమ్రంభీం, ఆసిఫాబాద్, నల్లగొండ జిల్లాల్లో 45 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం మంచిర్యాల జిల్లాలోని కొండాపూర్‌లో 45.8, జన్నారంలో 45.8, బెల్లంపల్లిలో 45.4, నీల్వాయిలో 45.5, కొమ్మెర 44, జగిత్యాల జిల్లాలోని జైనాలో 45.5, కుమ్రంభీం జిల్లా కెరమెరిలో 45.4, నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో 45.1, నల్లగొండ జిల్లా పజ్జూరులో 45 డిగ్రీల సెంటీగ్రేడ్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు మిగతా... 2లో




## ఉభయ తెలుగు రాష్ట్రాల్లో

# ఎన్నికల దరువు

**త్వరగా ఎన్నికల కోసం విపక్షాల చూపు**

**కర్నాటక తరహా విజయం సాధిస్తామన్న ధీమా**

హైదరాబాద్/అమరావతి,మే16(ప్రజా మంటలు): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిర్దేశించిన గడువుకే ఎన్నికలు జరుగుతాయని ఇద్దరు సిఎంలతో పాటు, పార్టీ నేతలుకూడా పదేపదే ప్రకటించినా విపక్ష పార్టీలకు మాత్రం త్వరగా ఎన్నికలకు వెళ్లాలన్న తొందర కనపిస్తోంది. అందుకే ఆయా పార్టీల నేతలు పొత్తులు, ఎత్తులతో అధికార పార్టీలను నిలదీసే పనిలో పడ్డాయి. నిర్ణీత గడువుమేరకే ఎన్నికలకు వెళతామని ఎపి సిఎం జగన్ సహా మంత్రులు పదేపదే చెప్పారు. అయినా ముందస్తు ఎన్నికలంటూ వాదనలు తెలరపైకి తెస్తున్నారు. బిజెపి, టిడిపి, జనసేన పొత్తులు ఉంటాయని పవన్ కళ్యాణ్ పరోక్షంగా చెబుతున్నారు. ఈ పొత్తులను ఎందుకనో అధికార వైసిపి జీర్ణించుకోవడం లేదు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ముందస్తు ఎన్నికల ప్రసక్తే లేదన్నారు. ఎలాగూ మరో ఆరు నెలల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. అందుకు అనుగుణంగా కెసిఆర్ ప్రణాళికలు సిద్దం చేసుకుంటున్నారు. అయితే ఒక్క తెలంగాణకు ఎన్నికలు నిర్వహిస్తారా లేక..ఉమ్మడిగా సార్వత్రిక ఎన్నికలతో కలసి నిర్వహిస్తారా అన్నది చూడాలి. కర్నాటకలో గెలుపుతో ఎపిలో, తెలంగాణలో గెలుపు అంటూ కాంగ్రెస్ జబ్బలు చరుచుకుంటోంది. ఎపిలో అయితే టిడిపి తమదే అధికారం అన్న ధీమాలో ఉంది.కెసిఆర్ ఎప్పుడు ఎన్నికలకు వెళ్లినా సిద్ధమని బిజెపి నేతలు ప్రకటించారు. అయితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారన్న భ్రమలు కల్పించే ప్రచారంలో టిడిపి నిమగ్నం అయ్యింది. త్వరగా ఎన్నికలు జరగగాలని టిడిపి కోరుకుంటోంది. శాసనసభ్యులందరూ ప్రజల్లోనే ఉండాలని ముఖ్యమంత్రి జగన్ స్వయంగా ప్రకటించడంతో ముందస్తు ఎన్నికలకు రంగం సిద్ధమైనట్టే అని పార్టీ నాయకులు నిర్ధారణకు వచ్చారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లాలనుకోవడం లేదని పదేపదే చెబుతున్నా.. వెళతారని, దానికి ఫలానా కారణాలు ఉన్నాయని ప్రచారం చేసుకుంటు న్నారు. నిజానిక జగన్ రెండేళ్లముందు గానే ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం లేదు. కేంద్రంలోని పెద్దలతో తనకు సత్సంబంధాలు ఉన్నందున ముందస్తుకు వెళితే వారి అండదండలు లభిస్తాయని జగన్ నమ్మకంగా ఉన్నారంటూ తెలుగుదేశమే ప్రచారం నిర్వహించడం మరో ఎత్తుగడగా చెప్పుకోవాలి. శాసనసభను రద్దుచేసి, వచ్చే ఏడాది మార్చిలోగా ఎన్నికలు జరిపించేలా కేంద్ర సహకారం తీసుకోవాలని ముఖ్యమంత్రి దాదాపుగా ఒక నిర్ణయానికి వచ్చారని చెబుతున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా జగన్ బాటలోనే అదే సమయంలో శాసనసభను రద్దుచేసి ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నట్లుగా బిజెపి తన ప్రచారంలో చెప్పుకుంటోంది. నిజానికి ముందే ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం కెసిఆర్‌కు లేదు. మిగతా... 2లో

## కెసిఆర్ ప్రభుత్వాన్ని

# కూల్చివేయక తప్పదు

- అందులో తానే ముందుటానన్న గద్దర్



వికారాబాద్,మే16(ప్రజా మంటలు) : తెలంగాణ కోసం పోరాడిన అమరుల ఉసురు తగిలి పోతావ్ అంటూ సీఎం కేసీఆర్ పై ప్రజా గాయకుడు గద్దర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చక పోగా నిరుద్యోగుల ఉసురు తీస్తున్నారని మండిపడ్డారు. ఇదేనా మనం కోరుకున్న తెలంగాణ అని విమర్శించారు. వికారాబాద్ జిల్లా పరిగిలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్‌లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ సమస్య అంటే భూమి సమస్య అన్న గద్దర్.. ఆనాడు 200 ఏళ్ళు పరిపాలించిన నిజాం రాజు భూమంతా తనేదనని విర్రవీగాడని అన్నారు. ఇప్పుడు కేసీఆర్ కూడా ధరణి పేరుతో హైదరాబాద్ చుట్టుపక్కల దాదాపు 25 లక్షల ఎకరాల భూమిని తన దగ్గర పెట్టుకున్నాడని ఆరోపించారు. భూ సమస్యలు, భూ తగాదాలు పెట్టిన కేసీఆర్ ..నీ పాలన కూల్చేస్తామని గద్దర్ హెచ్చరించారు. కూల్చేసే దాంట్లో తనది ప్రధాన పాత్ర మిగతా... 2లో



## కౌన్సిలింగ్‌కు ముందే

# ఇంజనీరింగ్ దందా

- ముందే అడ్మిషన్లు ఎలా జరుపుతారు
- సర్కార అండతో కళాశాలల ఇష్టారాజ్యం
- మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్

హైదరాబాద్,మే16(ప్రజా మంటలు) : కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలతో ఆటలాడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్య క్షులు బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మిగతా... 2లో




## ఉద్యోగాల నియామకాల్లో

# సమూల మార్పులు

- అంతా ఆన్‌లైన్ విధానంలో అమలు
- అవినీతి,బంధుప్రీతిని దూరం చేశాం: రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,మే16(ప్రజా మంటలు) : ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చా మని, దీనివల్ల అవినీతి, బంధుప్రీతి అంతమయ్యాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రభుత్వో ద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవడం దగ్గర నుంచి ఫలితాల ప్రకటన వరకు యావత్తు ప్రక్రియను ఆన్‌లైన్ చేశామని చెప్పారు. రోజ్‌గార్ మేళా సందర్భంగా ఆయన మంగళవారం ఉద్యోగార్హత పొందిన వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. రోజ్‌గార్ మేళా సందర్భంగా మిగతా... 2లో

## ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా పిట్టల


(రామ కిష్టయ్య సంగన భట్ల)




హైదరాబాద్ మే 16 (ప్రజా మంటలు): రాష్ట్రంలోని అన్ని ముదిరాజ్ కుల సంఘాలతో సత్ సంబంధాలను కలిగి ఉన్న ప్రముఖ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు, మత్స్య పరిశ్రమపై సంపూర్ణ అవగాహన కలిగి మత్స్య కార్మిక పక్షపాతిగా ఉన్న పిట్టల రవీందర్ ను తెలంగాణ ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది.

తెలంగాణ జే ఏసీ సమన్వయ కర్తగా, కన్వీనర్ గా, రాష్ట్ర విద్యా వంతుల వేదిక ప్రధాన బాధ్యునిగా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రధాన భూమికను పోషించిన పిట్టల రవీందర్ తెలంగాణ ముదిరాజ్ మహా సభ"ను స్థాపించి, దానికి ముఖ్య సలహాదారునిగా రాష్ట్ర వ్యాపితంగా ముదిరాజ్ సామాజిక వర్గ ప్రజలతో సత్సం బంధాలను కలిగి ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన రోజునుండి రాష్ట్రంలోని మత్స్య పరిశ్రమపై విశేష పరిశోధన చేసి, ఆ రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు అనేక వ్యాసాలు రాయడమే కాకుండా, జాతీయ, అంతర్జాతీయ వేదికలమీద మత్స్యరంగ నిపుణునిగా పాల్గొంటూ ముఖ్యమంత్రి దృష్టిని ఆకర్షించారు. అంతే కాకుండా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన మత్స్యకార కులాల మిగతా... 2లో

## ప్రజానాడి



## పార్లమెంట్ భవన ప్రారంభానికి

# ముహూర్తం ఖారారు

**28న ప్రారంభించేందుకు సన్నాహాలు**

న్యూఢిల్లీ,మే16(ప్రజా మంటలు) : పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖారారు అయినట్లుగా తెలుస్తోంది. ప్రధాని మోడీ అధికారంలోకి మిగతా... 2లో

## పార్టీ మార్పుపై దుష్ప్రచారం

- ఆదిలాబాద్ సోయం బాపూరావు ఖండన



ఆదిలాబాద్,మే16(ప్రజా మంటలు) : తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, బీజేపీలో కొనసాగుతానని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు క్లారిటీ ఇచ్చారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ కర్నాటకలో గెలవగానే.. దేశం మొత్తం విజయం సాధిం చినట్టు సంబరాలు చేసుకుంటోందన్నారు. తను పార్టీ మారుతున్నట్టు తప్పుడు కథనాలు ప్రచురించిన వారికి న్యాయపర మైన చర్యలు తీసుకుంటానని బాపురావు చెప్పారు. తన కుమా రుడి పెళ్లికి ఆహ్వా నించేందుకు ఇతర పార్టీల నేతలను కలిశానని, దానికి బద్నాం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ కు, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి సైతం పెండ్లి పత్రికలు అందిస్తానని అన్నారు. కాంగ్రె స్‌లో ఉన్నప్పుడు మహేశ్వర్ రెడ్డితో విభేదాలుండేవని, ప్రస్తుతం తమ మధ్య ఎలాంటి గొడవలూ లేవన్నారు.

## పర్యావరణ దిశగా

# టి.ఎస్.ఆర్టీసీ రవాణా సేవలు..

**ఈ - గరుడ ఏసీ బస్సులు లాంఛనంగా ప్రారంభం.**

**రవాణా శాఖ మంత్రి శ్రీ పువ్వాడ అజయ్ కుమార్**

హైదరాబాద్,మే16(ప్రజా మంటలు) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణీకుల సౌకర్యార్థం పర్యావరణ హితమైన ఏసీ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తోందని, ఈ-బస్సులను ప్రవేశపెట్టడంలో టి.ఎస్.ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి నిలిచిందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారు అన్నారు. కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ-గరుడ బస్సులను మంగళవారం సాయంత్రం హెదరాబాద్‌లోని మియాపూర్‌లో సంస్థ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ గారితో పాటు ఎం.డి వి.సి.సజ్జనర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ గారితో కలిసి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు.



# ఉద్యోగాల నియామకాల్లో సమూల మార్పులు

మొదటిపేజీ తరువాయి..
వర్చువల్ విధానంలో మోదీ దేశవ్యాప్తంగా సుమారు 71 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తన ప్రభుత్వం నియామకాల విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చిందని చెప్పారు. ప్రభుత్వోద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవడం దగ్గర నుంచి ఫలితాల ప్రకటన వరకు యావత్తు ప్రక్రియను ఆన్‌లైన్ చేశామని చెప్పారు. దీనివల్ల అవినీతి, బంధుప్రీతి అంతమయ్యాయని తెలిపారు. తన ప్రభుత్వం గడచిన తొమ్మిదేళ్ళలో సృష్టించిన ఉపాధి అవకాశాల గురించి వివరించారు. దేశంలో జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధిని కూడా వివరించారు. వాల్మార్ట్, యాపిల్, ఫాక్స్‌కాన్, సిస్కో వంటి ప్రధాన గ్లోబల్ కంపెనీల సీఈఓలతో తాను ఇటీవల సమావేశమయ్యానని, మన దేశంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికరంగం మునుపెన్నడూ లేనంత సకారాత్మక ధోరణిని ప్రదర్శిస్తోందని చెప్పారు. ఫార్మల్ ఎంఎలాయ్‌మెంట్ వృద్ధి చెందుతోందని, 2018-19 నుంచి దేశంలో 4.5 కోట్ల మంది ఉద్యోగాలు పొందారని చెప్పారు. ఈపీఎఫ్ఓ (ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ) వెల్లడించిన గణాంకాలను ప్రస్తావించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, రికార్డు స్థాయి ఎగుమతులు దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ నూతన ఉద్యోగావకాశాలను సృష్టిస్తున్నాయన్నారు. నూతన రంగాలకు తన ప్రభుత్వం మద్దతిస్తుండటం వల్ల ఉద్యోగాల స్వభావం మారుతోందని చెప్పారు. స్టార్టప్ సెక్టర్లో మన దేశం విప్లవాన్ని సృష్టించిందన్నారు. 2014 కన్నా ముందు కేవలం కొన్ని వందల సంఖ్యలో స్టార్టప్ కంపెనీలు ఉండేవని, ఇప్పుడు వీటి సంఖ్య దాదాపు 1,00,000కు చేరిందని చెప్పారు. వీటి వల్ల కనీసం 10 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటైన సంగతి తెలిసిందే. గడచిన సంవత్సరం జరిగిన అభివృద్ధిని ప్రస్తావిస్తూ, గ్రామీణ రోడ్ల పొడవు 4 లక్షల కిలోమీటర్ల నుంచి 7.25 లక్షల కిలోమీటర్లకు పెరిగిందన్నారు. విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 150కి పెరిగిందని చెప్పారు. ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం క్రింద పేదలకు 4 కోట్లకుపైగా పక్కా ఇళ్లను నిర్మించడం వల్ల ఉపాధి అవకాశాలు వచ్చాయని చెప్పారు. విశ్వవిద్యాలయాల సంఖ్య 2014నాటికి 720 ఉండేదని, ఇప్పుడు 1,100కు చేరిందని చెప్పారు.

# ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల దరువు

మొదటిపేజీ తరువాయి..
ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వానికి సంబంధాలు పూర్తిగా క్షీణించాయి. దీంతో ఆయన బిజెపి లక్ష్యంగా విమర్శలకు పదను పెడుతున్నారు. ఇదే అదనుగా బిజెపి కెసిఆర్ ముందస్తుకు వెళతారంటూ ప్రచారం చేస్తోంది. కొత్త అప్పులు పుట్టకపోతే ప్రభుత్వం ప్రకటించిన పలు పథకాలు నిలిచిపోతాయని, అదే జరిగితే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగే ప్రమాదం ఉందని కేసీఆర్,జగన్ భయపడుతున్నట్లుగా ఓ పుకారును వ్యాపితం చేస్తున్నారు.మామూలుగా అయితే తెలంగాణ లో ఈ ఏడాది నవంబరులో ఎన్నికలు జరగాలి. నిజానికి ప్రజల్లో ఓ రకమైన చర్చను తీసుకుని వచ్చే క్రమంలో విపక్ష టిడిపి ఎపిలో పుకార్లను బలంగా ప్రచారం చేస్తోంది.

తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య పొత్తు ఖాయం అన్నట్టుగా సంకేతాలు వస్తున్నం దున, అందుకు అనుగుణంగా జగన్ వ్యూహాలు రూపొందించు కుంటున్నారంటూ మరో ప్రచారంచేస్తోంది. బీజేపీ కలసి వచ్చినా రాకపోయినా తెలుగుదేశం పార్టీతో జతకట్టాలని జన సేనాని పవన్ కల్యాణ్ దాదాపుగా ఒక నిర్ణయానికి వచ్చారని పవన్ స్వయంగా చెబుతున్నారు. తాము తెలుగుదేశం పార్టీతో చేతులు కలపబోమని, తమ పొత్తు జనసేనకే పరిమితమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ పుకార్లు వచ్చాయి. ముందస్తు ఎన్నికలు జరిగినా జరగకపోయినా తెలుగుదేశం జనసేన మధ్య పొత్తు ఉంటుందని జగన్‌రెడ్డి మాత్రం బలంగా నమ్ముతున్నది.

పసవన్ కళ్యాణ్ను లక్ష్యంగాచేసుకుని వైసిపి నేతలు విమర్శలు చేస్తున్నారు. ఈ కారణంగానే దమ్ముంటే అన్ని స్థానాలకూ పోటీ చేయాలని పవన్ కల్యాణ్‌ను రెచ్చగొట్టే ప్రయత్నాలను వైసీపీ నాయకులు మొదలెట్టారు. తెలుగుదేశం పార్టీ ఒంటరిగా పోటీ చేసి జగన్‌ను ఎదుర్కోలేదని కూడా ప్రచారం చేస్తున్నారు. ఏ కారణం వల్లనైనా పొత్తు కుదరకపోతే ఈ ప్రచారం తమకు ఉపయోగ పడుతుందని వైసీపీ నాయకులు భావిస్తున్నారు. ఇకపోతే ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని జగన్ భావిస్తు న్నారు. వైసిపి చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎన్నికల కోసమే అన్నట్లుగా టిడిపి భావిస్తోంది. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాన్ని సతాయిస్తున్న కేంద్ర ప్రభుత్వం జగన్ ప్రభుత్వం విషయంలో ఉదారంగా వ్యవహరిస్తున్నదని గులాబీ శ్రేణులు భావిస్తున్నాయి. పేద ప్రజల సంక్షేమం కోసం తాను నిరంతరం పరితపిస్తున్నందుకే అందరూ తనపై కత్తిగట్టి తనకు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారని జగన్ ఎదరుదాడి చేస్తున్నారు. తనకు వ్యతిరేకంగా వార్తలు ప్రచురించే, ప్రసారం చేసే పత్రికలు, ప్రసార సాధనాలు తనపై కుట్ర చేస్తున్నాయని ఆయన విమర్శిస్తున్నారు. ప్రజల ముందు మాత్రం తాను పేదలకోసం పరితపి స్తుంటే దుష్ట శక్తులు అడ్డుకుంటున్నాయని ప్రచారం చేస్తున్నారు. అక్క చెల్లెమ్మలను ఆదుకుందామనుకుంటే దుష్టచతుష్టయం అడ్డుకుంటోందని జగన్ ఇటీవల పదేపదే ఎదురుదాడికి దిగుతున్నారు. తోడేళ్ల మందలాగా దాడులు చేస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. తెలంగాణలోనూ విపక్షాలు మైండ్‌గేమ్ ఆడుతున్నాయి. వారికి ఇప్పటికిప్పుడు ఎన్నికలు రావాలని కోరుకుంటున్నారు. కర్నాటక ఫలితాలు మొత్తంగా ఇప్పుడు విపక్షాలకు బలం చేకూరింది.

# విలీన ప్రతిపాదనలు తోసిపుచ్చిన షర్మిల

**విలీనం కోసం పార్టీ పెట్టలేదని వ్యాఖ్య**

**తాము ఛార్జింగ్ మోడల్‌లో ఉన్నామని వెల్లడి**

**మరోమారు పరీక్షా పత్రాలు లీక్ కావన్న గ్యారెంటీ లేదు**

**మీడియా సవావేశంలో వైఎస్సార్‌టిపి నేత షర్మిల**



**హైదరాబాద్,మే16(ప్రజా మంటలు) :** తమ పార్టీని విలీనం చేయాలని అన్నా పార్టీల నుంచి విస్డ్ కాల్స్ వస్తున్నాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. కాంగ్రెస్ పార్టీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ తెలంగాణ పార్టీని విలీనం చేస్తున్నట్లు... పొత్తు పెట్టుకుంటు న్నట్లు వస్తున్న వార్తలపై ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందిం చారు. అన్ని పార్టీల నుంచి మిస్ డ్ కాల్స్ వస్తున్నాయని.. ప్రస్తుతం చార్జింగ్ మోడ్‌లో ఉన్నామని స్పష్టం చేశారు. మంగళవారం పార్టీ ఆఫీసులో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో తమ పార్టీని విలీనం చేయటం లేదన్నారు. విలీనం చేయటానికి పార్టీ పెట్టాల్సిన అవసరం లేదని.. నేను వస్తానంటే ఏ పార్టీ కూడా వద్దు అని చెప్పదని.. అలాంటప్పుడు పార్టీని విలీనం ఎలా చేస్తానంటూ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితే బాగోలేదని.. 19 మంది ఎమ్మెల్యేలే గెలిస్తే.. ప్రస్తుతం ఐదుగురు మాత్రమే ఉన్నారని.. గెలిచిన ఎమ్మెల్యేలను నిలుపుకోలేని నాయకత్వం లోపం ఉందన్నారు. పార్టీ నుంచి వెళ్లిన వాళ్లను తిరిగి తీసుకొచ్చే సత్తా ఆ పార్టీకి ఉందా అని ప్రశ్నించారామె. దీనికి సమాధానం చెప్పాలని.. ఇది మిలియన్ డాలర్ల ప్రశ్నగా అభివర్ణించారామె. అయితే మిస్‌డ్ కాల్స్ వస్తున్నాయని.. ఆ విషయాలు తర్వాత వెల్లడిస్తామన్నారు. లీనం చేయాలనుకుంటే పార్టీనే పెట్టనని.. 3 వేల 800 కిలోమీటర్ల పాదయాత్ర చేయాల్సిన అవసరమే వచ్చేది కాదన్నారు.విలీనం చేయాలి అనుకుంటే ఎప్పుడో అది జరిగేదని.. ఇప్పుడు ఆ అవసరం లేదన్నారు షర్మిల. రాబోయే ఎన్నికల్లో పొత్తులపైనా షర్మిల స్పందించారు. జాతీయ సంస్థ చేసిన సర్వేలో తెలంగాణలో 43 నియోజకవర్గాల్లో వైఎస్ఆర్ టీపీ ప్రభావం చూపిస్తుందని రిపోర్టులు వచ్చాయని.. అలాంటప్పుడు 10, 20, 30 సీట్ల కోసం పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఏంటని మీడియానే ఎదురు ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజా సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న ఏకైక పార్టీ మాదే అని.. ఎవరి దగ్గర సీట్ల కోసం తగ్గాల్సిన అవసరం లేదన్నారు.ఇక బెంగళూరులో కాంగ్రెస్ పీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌తో భేటీపైనా స్పందించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరహాలోనే డీకే శివకుమార్ రాజకీయం చేశారని.. కష్టపడి పార్టీని గెలిపించారని.. వ్యక్తిగతంగా ఉన్న అనుబంధంతో కలిసి శుభాకాంక్షలు చెప్పినట్లు వివరించారు. మత, కుట్ర రాజకీయాలకు చెంపపెట్టుగా కర్నాటక ఫలితాలు వచ్చాయని వైఎస్ షర్మిల చెప్పుకొచ్చారు. ఇకపోతే టీఎస్ పీఎస్సీ పేపర్ మరోసారి లీక్ కాదని గ్యారంటీ ఏంటని ఆమె ప్రశ్నించారు. పేపర్ లీక్‌తో లక్షలాది మంది విద్యార్థులను కేసీఆర్ ఆగం చేసిండని మండిపడ్డారు. టీఎస్ పీఎస్సీ బోర్డులో ఎలాంటి చర్యలు తీసుకోకుండా మళ్లీ పాత అధికారులతోనే పరీక్షలు పెడుతున్నారని షర్మిల అన్నారు. మళ్లీ పేపర్లు లీక్ కావన్న గ్యారంటీ కేసీఆర్ ఇస్తారా? అని ప్రశ్నించారు. 9 సంవ్సరాలుగా ఒక్క గ్రూప్ వన్ 1 పోస్టు భర్తీ చేయలేదన్నారు. పేపర్ లీక్‌తో లక్షలాది మంది విద్యార్థులను సీఎం కేసీఆర్, కేటీఆర్ ఆగం చేశారని విమర్శించారు షర్మిల. టీఎస్ పీఎస్ సీ పేపర్ లీక్, పరీక్షల నిర్వహణ, ఉద్యోగాల భర్తీపై సీఎం కేసీఆర్ కు అఫిడవిట్ పంపించారు.ఈ సారైన టీఎస్ పీఎస్ సీ పేపర్లు లీక్ కాబోవని.. కేసీఆర్ విద్యార్థులకు గ్యారంటీ ఇవ్వాలని అఫిడవిట్ లో పేర్కొన్నారు. పేపర్ లీక్ ప్రభుత్వ వైఫల్యమేనని విద్యార్థులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలన్నారు. తెలంగాణ బిడ్డలకు కేసీఆర్ గ్యారంటీ ఇస్తున్నట్లుగా ఒక డిక్లరేషన్ పంపిస్తున్నామని వెల్లడించారు. ఎగ్జామ్స్ నిర్వహణలో ఎలాంటి పాదర్శకత లేకుండా, ఫూల్ ప్రూఫ్ పద్దతిలో ఎగ్జామినేషన్ కండక్ట్ చేసే బాధ్యత కేసీఆర్ తీసుకోవాలన్నారు. బిశ్వాల్ కమిటీ చెప్పిన లక్షా 90 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ డిక్లరేషన్ పై కేసీఆర్ సైన్ చేయాలన్నారు. ఐటీశాఖ మంత్రి, టెక్నిషియన్స్ సరిగా పనిచేస్తే పేపర్ లీక్ అయ్యేది కాదన్నారు. ఐటీ చట్టం ప్రకారం ప్రతి శాఖలోని ప్రతి సిస్టమ్ బాధ్యత ఐటీ శాఖదేనన్నారు. ఐటీశాఖ మంత్రిగా ఉండి.. కేటీఆర్ తనకు సంబంధం లేదంటే ఎలా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షాల వల్ల పేపర్ లీకులు అయ్యాయని సిట్ మీకు చెప్పిందా? అని కేటీఆర్ ను ప్రశ్నించారు. విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన అవసరం కేసీఆర్ కు ఉందని... ఇంత వరకు టీఎస్ పీఎస్ సీ పేపర్ లీక్ ఘటనపై ఎందుకు స్పందించలేదని షర్మిల ప్రశ్నించారు.

## కాంగ్రెస్ సిఎం ఎంపికలో
# ఇంత నిర్లక్ష్యమా?

**సంపూర్ణ మెజార్టీ దక్కినా ఏకాభిప్రాయం మృగ్యం**

**తెలంగాణలో అయితే పదిమంది సిఎం పోటీదారులు**

**మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఎద్దేవా**



**నల్గొండ,మే16(ప్రజా మంటలు) :** కర్ణాటకలో ఎన్నికల ఫలితాలు వచ్చి నాలుగు రోజులైందని.. మెజార్టీ స్థానాలు గెలుచుకున్నా అంతర్గత కుమ్ములాటలతో సీఎంను కాంగ్రెస్ ఎంపిక చేసుకోలేకపోతోందని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాజస్థాన్ కాంగ్రెస్‌లోనూ సొంత పార్టీ నేతలే తిరుగుబాటు చేస్తున్నారన్నారు. కర్ణాటకలో వచ్చిన ఫలితాలను చూసిన తర్వాతైనా బిజెపికి జ్ఞానోదయం కలగలేదని విమర్శించారు. దేశంలో మతకల్లోలాలు సృష్టించి అధికారంలోకి రావాలని బిజెపి చూస్తోందని ఆయన ఆరోపించారు. నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో గుత్తా మాట్లాడారు.తెలంగాణ మరింత అభివఅద్ధి చెందాలంటే సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమని ఆయన చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 100 స్థానాల్లో బిఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. వామపక్షాల మద్దతు లేకుండానే రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చామన్నారు. మతోన్మాద ఎజెండాతో ఎన్నికలకు వెళ్లిన బీజేపీకి కర్ణాటక ప్రజలు గుణపాఠం చెప్పినా కరీంనగర్ ఏక్తా యాత్రలో అసోం సీఎం, బండి సంజయ్ మాటల తీరు మారలేదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మండి పడ్డారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఇచ్చినా అంతర్గత కుమ్ములాటలు, ఆధిపత్య పోరుతో సీఎం అభ్యర్థిని తేల్చలేకపోవడం ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతుందన్నారు. కర్ణాటక పరిణామాలు గమనిస్తున్న తెలంగాణ ప్రజలు రానున్న కాలంలో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే బీజేపీ, అధికారం ఇచ్చినా పాలించే సత్తా లేని కాంగ్రెస్ పార్టీలకు ఓట్లేస్తే తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిలా చేస్తాయని హెచ్చరించారు. కర్ణాటక ఫలితాలతో తెలంగాణలో కాంగ్రెస్ నేతలు అధికారం కోసం పగటి కలలు కంటున్నారు. వారి కలలు కల్లలే అవుతాయి. కర్ణాటకలో సీఎం కుర్చీ కోసం ఇద్దరు నేతలు పోటీ పడితే.. తెలంగాణలో 12 మందికి పైగా పోటీలో ఉన్నార ని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సెక్యులర్ పాలనలో ప్రజలు అభివృద్ధి పథంలో సాగుతున్నారని తెలిపారు. రాష్ట్రం సురక్షితంగా ఉండాలన్నా, సుభిక్షంగా విరాజిల్లాలన్నా, కేంద్రంలోని బీజేపీ మతోన్మా దానికి వ్యతిరేకంగా పోరాడుతున్న సీఎం కేసీఆర్‌తోనే వామపక్షాలు కలిసి నడుస్తాయని చెప్పారు.

# రైతుసంక్షేమాన్ని తట్టుకోలేక పోతున్న బిజెపి

**అందుకే పదేపదే విమర్శలుచేస్తున్న నేతలు**

**బిజెపి తీరుపై మండిపడ్డ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**

**నిజామాబాద్,మే16(ప్రజా మంటలు):** తెలంగాణలో రైతు నామ సంవత్సరం నడుస్తోందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రైతుల నడ్డి విరిచిన బిజెపి..కర్నాటకలో బొక్కబోర్లా పడ్డదన్నారు. అందుకే గట్టిగా బుద్ది చెప్పారని అన్నారు. తెలంగాణలో ప్రభుత్వం ప్రజల పక్షాన ఉందని, బిజెపిలాగా ప్రజలను పక్కన పెట్టి పాలన చేయడం లేదని అన్నారు. తెలంగాణలో అధికారం కల్ల అని బిజెపి, కాంగ్రెస్‌లు గుర్తిస్తే మంచిదని అన్నారు. మరోమారు కెసిఆర్ నాయకత్వంలో హ్యాట్రిక్ సాధించబోతున్నామని, అన్నారు. తెలంగాణలో కూడా బిజెపికి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని అన్నారు. తెలంగాణ తరహా పథకాలు దేశమంతా అమలు చేసే ధైర్యం ఉందా లేదా బిజెపి నేతలు చెప్పాలన్నారు. రైతులకు 24 గంలట కరెంట్ అందివ్వ డంతో పాటు, ఎకరాలకు 5వేల ఆర్థిక సాయం అందు తోందని అన్నారు. సిఎం కెసిఆర్ సంకల్పంతో రైతులకు మహర్దశ వచ్చిందదని అన్నారు. 24 గంటల కరెంట్ కారణంగా పంటల దిగుబడి పెరిందని, అలాగే వాణిజ్య పంటలకు మొగ్గుచూపాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. పామాయిల్ లాంటి సాగును చేపట్టాలని ఈ మేరకు ఆయన రైతులకు సూచనల చేశారు. తెలంగాణలో జరుగుతున్న అబి వృద్ది కార్యక్రమాలను చూసి బిజెపి తట్టుకోవడం లేదన్నారు. అలాగే ప్రతి రైతు పొలాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా కేసీఆర్ సర్కారు పనిచేస్తోందని అన్నారు. సాహసోపేతమైన బృహత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టిన సీఎం కేసీఆర్‌కు రైతులు జీవితాంతం రుణపడి ఉంటారని అన్నారు. సమస్యలను ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని, చిన్న, చిన్న కారణాలతో పనులను నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా ఎత్తిపోతల పథకాల పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా అమలు కావడం లేదని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు దమ్ముంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ తరహాలో సంక్షేమ పథకాలు అమలు చేయించాలని సవాల్ విసిరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తాగునీటి సరఫరా, పరిశుభ్రత, పచ్చదనం, విద్యుత్ సరఫరా వంటి మొదలగు అంశాల ప్రాతిపదికన సర్వేచేపట్టి దేశవ్యాప్తంగా ఉత్తమ గ్రామాలను ఎంపిక చేసిందన్నారు.

# ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా పిట్టల

(మొదటి పేజీ తరువాయి)

ఐక్య వేదిక SOUTH INDIAN FISHERMEN COMMUNITIES ASSOCIATION (SIFCA)ను స్థాపించి దానికి వ్యవస్థాపక కన్వీనర్‌గా కొన సాగుతున్నారు కూడా.

రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో "తెలంగాణ జేయేసి" సమన్వయ కర్తగా వేలాది జేయేసీలను ఉద్యమ కార్యాచరణలో సమన్వయం చేయడంతో పాటుగా, వేలాది మంది ఉద్యమ కారులతో పిట్టల రవీందర్ ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉన్నారు. "తెలంగాణ జేయేసీ"లో భాగస్వాములుగా కొనసాగిన అనేక ప్రజాసంఘాలు, కులసంఘాలు, రాజకీయపార్టీల నాయకులందరినీ ఉద్యమం లోకి సమన్వయ పంచడంలో పిట్టల రవీందర్ ముఖ్య భూమికను పోషించారు. ఒక ప్రజాకవిగా, ప్రముఖ రచయితగా, సీనియర్ జర్నలిస్టుగా, ఉద్యమ కారునిగా, మేథో సంపత్తి కలిగిన ఆలోచనా పరునిగా, విద్యావంతునిగా రవీందర్ గడచిన 35 సంవత్సరాల ప్రజా జీవితంలో ప్రదర్శించిన విశేష ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయనను స్వయంగా తన ఇంటికి పిలిపించుకుని, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యత కల్పించి గుర్తింపు ఇస్తామని ఏడాదిన్నర క్రితమే స్పష్టమైన హామీ ఇచ్చినట్లు పార్టీ ముఖ్యులు ఈ సందర్భంగా గుర్తుకు చేసుకుంటు న్నారు. ఈ క్రమంలో పశు సంవర్థక శాఖ, పాల అభివృద్ధి, మత్స్య శాఖ ద్వారా ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 45, తేదీ 16.5.2023 ద్వారా ప్రభుత్వ స్పెషల్ సెక్రెటరీ అధర్ సింహ సంతకంతో కరీంనగర్ జిల్లా వీణ వంక ప్రాథమిక మత్స్య సహకార సంఘం కు చెందిన పిట్టల రవీందర్ ను చైర్మన్ గా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రామాంత పూర్ సహకార సంఘం కు చెందిన దీటి మల్లయ్యను వైస్ చైర్మన్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## కెసిఆర్ ప్రభుత్వాన్ని
# కూల్చివేయక తప్పదు

మొదటిపేజీ తరువాయి..
ఈ విషయాన్ని కేసీఆర్ గుర్తు పెట్టుకోవాలని అన్నారు. మా భూములు మాకే, మా నీళ్లు మాకే అని పోరాడి తెలంగాణ తెచ్చుకున్నం..ఇప్పుడు గరీబోని భూమి గుంజుకుని కోట్లకు పడగలెత్తిన కంపెనీలకు ఇస్తున్నవ్ అని కేసీఆర్‌పై మండి పడ్డారు. భూమి జోలికొస్తే ఊరుకునేది లేదని, ఖబడ్దార్ అని బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను గద్దర్ హెచ్చరించారు. దొరల అధీనంలో ఉన్న వేల ఎకరాల భూమిలో నాగండ్లు కడుతామని, భూమిని దున్నినట్లు నీ పాలన దున్నేస్తామని కేసీఆర్ పై గద్దర్ ఘాటు విమర్శలు చేశారు.

## పార్లమెంట్ భవన ప్రారంభానికి
# ముహూర్తం ఖారారు

మొదటిపేజీ తరువాయి..
వచ్చి త్వరలో తొమ్మిదేళ్లు పూర్తి చేసుకోబోతున్న క్రమంలో మే 28 న పార్లమెంట్ కొత్త భవనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభిస్తారని తెలుస్తోంది. 2014 మే 26న భారత ప్రధానిగా మోడీ మొదటిసారిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2020 డిసెంబర్‌లో ఆయన కొత్త పార్లమెంట్ భవనం నిర్మాణ పనులను శంకుస్థాపన చేయగా 2021 అక్టోబర్ 1 నుంచి నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. రూ.970 కోట్ల అంచనా వ్యయంతో ఈ కొత్త పార్లమెంట్ ను నిర్మించారు. దాదాపుగా పనులు కూడా తుదిదశకు చేరుకున్నాయి.ఈ నిర్మాణ పనులను కేంద్ర గృహ నిర్మాణ శాఖ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. 64,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ పార్లమెంట్ నాలుగు అంతస్తులతో ఉంటుంది. మొత్తం 1,224 మంది ఎంపీలకు కూర్చునే అవకాశం ఉంటుంది. కొత్త పార్లమెంట్ భవనంలో మూడు ప్రధాన ద్వారాలు ఉన్నాయి, వాటికి జ్ఞాన్ ద్వార్, శక్తి ద్వార్, కర్మ ద్వార్ అని పేర్లు పెట్టారు. ఇక ఇందులో పెద్ద హాళ్లు, లైబ్రరీ, విశాలమైన పార్కింగ్ స్థలంతో పాటు కమిటీ గదులు కూడా ఎన్నో హంగులతో రూపుదిద్దుకున్నాయి. కొత్త పార్లమెంట్ భవనంలో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్‌తో పాటుగా దేశంలో ప్రధాన మంత్రులుగా చేసిన వారి ఫొటోలను పొందుపరచ నున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలైలో కొత్త భవనంలో జరుగుతాయని సమాచారం.

## కౌన్సిలింగ్‌కు ముందే
# ఇంజనీరింగ్ దందా

మొదటిపేజీ తరువాయి..
కౌన్సిలింగ్ ప్రారంభం కాకుండానే ఇంజనీరింగ్ అడ్మిషన్ల దందా చేస్తారా అని ప్రశ్నించారు. ప్రైవేటు వర్శిటీ హోదా రాకుండానే గురునానక్, శ్రీనిధి కాలేజీల్లో 4 వేల మందికి అడ్మిషన్లు ఎలా ఇస్తారని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వం డబ్బులకు అమ్ముడుపోయి విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తోందన్నారు. ప్రమోషన్లకు అమ్ముడుపోయిన కొందరు పోలీసులు ఏబీవీపీ నాయకులను వేధిస్తున్నారని మండిపడ్డారు. ఉన్నత విద్యా మండలి ఎదుట ధర్నా చేస్తే తమకొచ్చిన నొప్పేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తారా అని మండిపడ్డారు. తక్షణమే ఏసీపీ సహా పోలీసులపై చర్యలు తీసుకోవాల్సిందే అని డిమాండ్ చేశారు. ఈటల రాజేందర్ తమ పార్టీ నాయకుడని... జాతీయ నాయకత్వాన్ని కలవడానికి వెళితే తప్పేందని ప్రశ్నించారు. దళితులను తిట్టిన మంత్రి శ్రీనివాస్ గౌడ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాల్సిందే అని పట్టుబట్టారు. అంబేద్కర్ లేకుంటే ఆయనది బిచ్చపు బతుకయ్యేదనే సంగతి తెలుసుకుంటే మంచిది అంటూ బండి సంజయ్ పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో... మండుటెండలు

మొదటిపేజీ తరువాయి..
నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఎండ తీవ్రతకు శరీరంలో నీరు త్వరగా ఆవిరైపోతుంది కాబట్టి నీటిని అధికంగా తీసుకోవాలి. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, గ్లూకోజ్ నీళ్లు ఎక్కువగా తాగాలి. వీటి వల్ల శరీరం డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటుంది. పెరిగిన ఎండల తీవ్రతకు ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ తగిలి ఇపిట్టల్లా రాలిపోతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కూడా ఎండలు దారెత్తిస్తున్నాయి. ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు మంట పుట్టిస్తున్నాయి. అధిక వేడి.. ఉక్కపోతకు జనం విలవిల్లాడిపోతున్నారు. పలు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పార్వతీపురంలో అత్యధికంగా 47 డిగ్రీలు, సీతంపేటలో 46, సాలూరులో 41 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలో ఉండలేక.. బయటకు రాలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రధానంగా సీతంపేటలో మన్యంలో మునుపెన్నడూ లేనివిధంగా ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోయారు. భామిని, వీరఘట్టం తదితర మండ లా ల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. చాలామంది చెట్ల నీడను ఆశ్రయించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే తొలిసారని అంటున్నారు.మరికొన్ని రోజుల పాటు ఉష్ణోగ్రతల తీవ్రత ఇదే విధంగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరికలు చేసింది.

# నేడు బిఆర్ఎస్ సమావేశం

మొదటిపేజీ తరువాయి..
తీసుకుని వెళ్లేలా సిఎం కెసిఆర్ శ్రేణులకు దిశానిర్దేశం చేయ నున్నారు. అయితే అధికార పార్టీ టెన్షన్ పడుతున్నట్టుగా కనిపిస్తోందని కాంగ్రెస్ సాధారణంగానే విమర్శలకు దిగింది.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గట్టిపోటీ ఇస్తుందనే భావనకు వచ్చిన బీఆర్ఎస్.. ఆ పార్టీ వ్యూహాలపై ఆపరేషన్ కు శ్రీకారం చుట్టినట్టుగా తెలుస్తోందని చెబుతోంది. ఇందులో భాగంగానే అర్ధరాత్రి దాటాక బంజారాహిల్స్ లోని యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా ఆఫీసుపై సైబర్ క్రైం పోలీసులు దాడి చేశారా..? అన్న అను మానాలు వ్యక్తమవుతున్నాయి.

కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు వ్యూహకర్తగా సునీల్ కనుగోలు ఉన్న విషయం తెలిసిందే. కనుగోలు టీం వ్యూహాలు.. హైదరాబాద్ కేంద్రంగా సాగిన సోషల్ మీడియా ఆపరే షన్లు కర్నాటకలో పార్టీని గెలిపించాయని కాంగ్రెస్ నేతలే బహిరంగ ప్రకటనలు చేశారు. మరో ఐదారు నెలల్లో తెలంగాణలో ఎన్నికలు ఉండటం, ఇక్కడి వ్యూహకర్త కూడా సునీల్ కనుగోలే కావడంతో అధికార బీఆర్ఎస్.. ఆ పార్టీ స్ట్రాటజీ తెలుసుకునే పనిలో పడినట్టు సమాచారం.

## రైతులకు ఇబ్బందులు
# కలగకుండా చర్యలు

**వరంగల్,మే16(ప్రజా మంటలు):** మార్కెట్లలో అమ్మకాలకు వచ్చే రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని మార్కెటింగ్ అధికారులు సూచించారు. ఈ మేరకు అన్ని మార్కెట్లకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. మార్కెట్‌కు వచ్చే ఉత్పత్తి పూర్తి స్థాయిలో కొనుగోలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని జేసీ ఆదేశించారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నాణ్యత ప్రమాణాలు కలిగిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సూచించారు. ఇకపోతే కంది పంట సాగు పెరిగిందని, పెద్ద ఎత్తున దిగుబడి వచ్చే అవకాశం ఉందని, కంది చేల కోత ఇబ్బందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. కంది పంట కోత దశకు చేరుకున్న తరుణంలో, మార్కెటింగ్ సౌకర్యాల కల్పనపై ముందస్తు ఏర్పాట్లకు సిద్ధం కావాలని సూచించారు. జిల్లా కంది పంట సాగు, దిగుబడి, గతంలో క్రయ, విక్రయాలు, సౌకర్యాలు, ఇబ్బందులపై జేసీ సమీక్షించారు.



## జనగామ పట్టణంలో డెంగీ వ్యాధి
# నివారణ అవగాహన ర్యాలీ

**జనగామ మే 16 (ప్రజామంటలు):** జాతీయ డెంగ్యూ నివారణ దినం సందర్భంగా మంగళవారం పట్టణ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ వ్యాధి నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ జిల్లా అధికారి డా. కరుణాకర్ రాజు మాట్లాడుతూ.... డెంగీ జ్వరం మంచి నీటిలో పెరిగే టైగర్ దోమ ద్వారా వ్యాపించే అవకాశం ఉందని అన్నారు. దోమలు లేకుండా పరిసర పరిశుభ్రత పాటించాలని సూచించారు. మాస్ మీడియా అధికారి ప్రభాకర్ డెంగీ లక్షణాలు, నివారణ జాగ్రత్తల గురించి వివరించారు. ర్యాలీ లో ప్రోగ్రాం అధికారి డా. భాస్కర్, వైద్యులు డా. శ్రీవిద్య, డా. మౌనిక, సామాజిక అధికారి రహమాన్, డిపిహెచ్ ఎన్. రమాదేవి, అనాంబిక, రవీందర్, ముస్తఫా, ఏయన్ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన ఇంటికి మన సంజయ్

**కోరుట్ల టౌన్ మే 17 (ప్రజామంటలు):** కోరుట్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు డా. కల్వకుంట్ల సంజయ్ చేపట్టిన మన ఇంటికి మన సంజయ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కోరుట్ల పట్టణంలోని 10వ వార్డులో సంజయ్ పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ



వాటి పరిష్కారానికి కృషి చేస్తానని స్వతహాగా వైద్యుడు అయినందున వార్డ్ లలో తిరుగుతూ దీర్ఘ కాలిక రోగులకు తగిన సూచనలు ఇస్తూ ఆర్థికంగా లేని వారికి సహాయం చేస్తూ ముందుకు సాగుతు నియోజకవర్గ ప్రజలకు నేనున్నాను అనే భరోసాను కల్పిస్తూ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కోరుట్లలో బంద్ ప్రశాంతం

**కోరుట్ల టౌన్ మే 17 (ప్రజామంటలు):** మొన్న జగిత్యాలలో ఇద్దరు మహిళల మధ్య జరిగిన ఘర్షణ మూలంగా ఒక మతానికి సంబందించిన వారికి వత్తాసు






పలకడం సరికాదని దీనికి సంబంధించి ఎస్ఐ అనిల్ యాదవ్ ను సస్పెండ్ చేసినందుకు నిరసనగా కోరుట్ల పట్టణంలో విశ్వహిందూ పరిషత్ మరియు భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణ ప్రజలు అందరు స్వచ్ఛంధంగా బంద్ పాటించారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా యాదవ కుల సంఘ నాయకులు, వీహెచ్పీ భజరంగ్ దళ్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఆర్డీఓ కు ఎస్ఐ అనిల్ యాదవ్ యొక్క సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్పీ జిల్లా కార్యదర్శి గజం రాజు, పట్టణ కార్యదర్శి చెట్పల్లి శంకర్, ఆర్ఎస్ఎస్ నగర కార్యవహా గట్ల శివ, భజరంగ్ దళ్ కార్యకర్తలు కల్లెడ రోహిత్, పల్లికొండ వెంకటేష్, రాచకొండ చంద్రశేఖర్, ఇందురి ప్రశాంత్, కోయాల్కర్ శివ, జయప్రకాశ్ మరియు యాదవ యువజన సంఘ నాయకులు జల ఆనంద్, గాడేల విజయ్, దండికే కిషోర్, జల హరీష్, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బొల్లారంలో ఉచిత వైద్య ఆరోగ్య శిభిరం

### 464 మంది పేషంట్లకు వైద్య పరీక్షలు, మందులు

**సికింద్రాబాద్ మే 16 (ప్రజామంటలు):** బొల్లారం లోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ లో మంగళవారం కోహెన్స్ లైఫ్ సైన్సెస్ సీ.ఎస్.ఆర్. సహకారంతో ఉచిత మెగా వైద్య, ఆరోగ్య శిభిరాన్ని నిర్వహించినట్లు పద్మారావునగర్‌కు చెందిన



జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. మల్లారెడ్డి నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన జనరల్ మెడిసన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, గైనకాలజీ, డెర్మటాలజీ వైద్య నిపుణులు 464 మంది పేషంట్లకు హెచ్.పీ, ఆర్.బీ.ఎస్, బీపీ, డయాబెటిక్, ఫిజియోథెరపీ వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులను కూడ అందచేశారు. కార్యక్రమంలో జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులను
# ప్రారంభించిన ఎమ్మెల్యే సతీష్ కుమార్

**చిగురుమామిడి మే 16 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండలంలో మంగళవారం ఎమ్మెల్యే సతీష్ కుమార్ పర్యటించారు లంబాడిపల్లె నుండి ముది మాణిక్యం ఎక్స్ రోడ్ వరకు 33 లక్షల 50 వేల రూపాయలతో నిర్వహించనున్న రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు. అనంతరం చిగురుమామిడి రేకొండ గ్రామంలో నిర్మించిన వైకుంఠ దామాలను ప్రారంభించారు. అలాగే రేకొండ గ్రామంలో 10 లక్షలతో నిర్మించిన మత్స్య పారిశ్రామిక భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత పల్లెలుగా అభివృద్ధి చెందుతున్నయన్నారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వినీత శ్రీనివాస్ రెడ్డి చైర్మన్ వెంకటరమణారెడ్డి. బిఆర్ఎస్ మండల ఇంచార్జ కర్ర రవీందర్. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, ఎంపీడీవో మామిడిపల్లి నరసయ్య, వైస్ ఎంపీపీ బెతి రాజిరెడ్డి, సర్పంచులు జక్కుల రవీందర్, బెజ్జంకి లక్ష్మణ్, నాగేల్లి వకుల, పిట్టల రజిత, సన్నిళ్ళ వెంకటేశం, ఎంపీటీసీలు మెడబోయిన తిరుపతి, కొత్తూరు సంధ్య, ఏలేటి రవీందర్ రెడ్డి, మిట్టపల్లి మల్లేశం ఉపసర్పంచులు ముంజ శిరీష ప్రకాష్ గౌడ్, ఒంటెల కిషన్ రెడ్డి, నాయకులు రామోజీ





కృష్ణమాచారి, పెద్దపల్లి అరుణ్ కుమార్, సాంబారి కొముురయ్య, ఎండి సర్వర్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల సాధన పోరాటాల ద్వారా మాత్రమే సాధ్యం

### మే 22న జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా విజయవంతం చేయండి

**జనగామ మే 16 (ప్రజామంటలు):** కస్తూర్బా, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న



జిల్లా కలెక్టరేట్ ల ఎదుట ధర్నా విజయవంతం చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. చంద్రశేఖర్ రావు కోరారు. జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కెజిబివి,యుఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ తీర్పు మేరకు సమాన పనికి ,సమాన వేతనం అని ఉన్న ప్రభుత్వాలు వాటి అమలు పెడచెవిన పెట్టి వెట్టి చాకిరి చేయిస్తుందని ,అనేక సార్లు మినిమం బేసిక్ పే మంజూరు చేయాలని ప్రతిపాదనలు చేసిన చలనం లేదని అన్నారు.

కెజిబివి, యుఆర్ఎస్ లలో అనేక సమస్యలు ఉన్న చదువు విషయంలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని, హాస్టల్ కొరకు వార్డెన్ పోస్ట్ మంజూరు చేయకుండా ఉన్నవారితోనే సర్దుబాటు చేస్తున్నారని, అరకొర వేతనాలతో దోపిడీ చేస్తున్నారని, ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న సర్వీసుకు గ్యారంటీ లేకుండా పోయిందని, వెంటనే సర్వీస్ ను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 22న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస రావు మాట్లాడుతూ అరకొర వేతనాలు ఇస్తూ, ఎలాంటి భవిష్యత్తు భరోసా లేకుండా, ఉద్యోగం రెగ్యులర్ అవుతుందో, లేదో తెలియని స్థితిలో ఉద్యోగులు పని చేస్తున్నారని, అనేకసార్లు విన్నవించినా ప్రభుత్వం మొద్దు నిద్ర ప్రదర్శిస్తుందని, ఇక పోరాటాల ద్వారా మాత్రమే సమస్యల సాధన సాధ్యమౌతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రజిత, చైతన్య, లక్ష్మీ, హేమలత, సంధ్య, స్వాతి, స్వప్న పాల్గొన్నారు.

## ఫ్యామిలీ పెన్షనర్స్ ప్రయోజనాలపై
# వివరణాత్మక ఉత్తర్వులు

**జగిత్యాల మే 16 (ప్రజామంటలు):** ప్రభుత్వ సర్వీసులో ఉన్న ఉద్యోగి/ఉద్యోగిని మరణిస్తే వారి కుటుంబాలకు ప్రభుత్వ ప్రయోజనాలపై వివరణాత్మక ఉత్తర్వుల వివరాలను



తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తెలిపారు.

1. భర్త ఉద్యోగి అయితే భార్యకు ఫ్యామిలీ పెన్షన్ ఆమె చనిపోయే వరకు లేక తిరిగి పెళ్లి చేసుకొన్నంత వరకు, ఏది ముందు సంభవిస్తే అంత వరకు. భార్య ఉద్యోగి అయితే భర్తకు ఫ్యామిలీ పెన్షన్ అతను చనిపోయేంత వరకు, తిరిగి పెళ్లి చేసుకొన్నంత వరకు ఏది ముందు సంభవిస్తే అంతవరకు. 2. కుమారుడికి ఫ్యామిలీ పెన్షన్ మంజూరుకు అతనికి 25 సంవత్సరాలు నిండే వరకు లేక అతను సంపాదన ఆర్జించే వరకు ఏది త్వరగా సంభవిస్తే అప్పటివరకు. 3. కూతుర్లకు ఫ్యామిలీ పెన్షన్ చెల్లింపునకు వారికి పెళ్లి అయ్యేంత వరకు. 4. కొడుకులు, కూతుర్లు, అంగ వికలాంగులు,మానసిక వికలాంగులు అయిన వారు ఎంత వయసు వచ్చినా సొంతంగా సంపాదించ లేని పరిస్థితుల్లో వారు జీవించి ఉన్నంత వరకు ఫ్యామిలీ పెన్షన్ కు అర్హులు. 5. అంగ వికలాంగులు/మానసిక వికలాంగులు, ఒకరి కంటే ఎక్కువ మంది ఉంటే మొదటి వ్యక్తి ఫ్యామిలీ పెన్షన్ కు అర్హత కోల్పోయిన తర్వాత ,రెండవ వారికి ప్రయోజనం చెల్లించాలి. 6. కవల పిల్లలకు పెన్షన్ చెల్లించాల్సిన సందర్భంలో ఇద్దరికి సమానంగా వాటా చెల్లించాలి. 7. కవల పిల్లల్లో ఒకరు పెన్షన్ కు అనర్హత ఉంటే అతని వాటా వేరొక కవల కు చెల్లించాలి. 8. ఇద్దరు కవలలు అనర్హులుగా ఉంటే తరువాత ఉన్న వారికి ఫ్యామిలీ పెన్షన్ చెల్లించాలి. 9. మైనర్ పిల్లలకు ఫ్యామిలి పెన్షన్ వారి గార్డియన్ ద్వారా చెల్లించాలని వివరణాత్మక ఉత్తర్వులను మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన వారు కోరుతున్నందున సమాచారం కోసం హరి ఆశోక్ కుమార్ తెలిపారు.

# గాంధీ ఆసుపత్రిలో శానిటేషన్ పనులకు ఈవీ వెహికల్

**సికింద్రాబాద్ మే 16 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రిలో నిత్యం పెరుగుతున్న పేషంట్ల సంఖ్యకు అనుగుణంగా శానిటేషన్ పనులను మరింత మెరుగ్గా, వేగవంతంగా చేసేందుకు జీడీఎక్స్ సెక్యూరిటీ, శానిటేషన్ నిర్వహకులు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో రూ 3.50 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఎలక్ట్రికల్ వెహికల్ ను ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ. రాజారావు మంగళవారం ప్రారంభించారు. రోజు, రోజుకి పెరుగుతున్న అవసరాలకు



తగ్గట్లు అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎలక్ట్రికల్ వెహికల్ సాయంతో ఆసుపత్రిలోని అన్ని ఫ్లోర్లకు రాంప్ వెంట వెళ్ళి త్వరితగతిన చెత్తను సేకరించి, డంపింగ్ యార్డుకు తీసుకెళ్ళి డిస్పోజ్ చేయడానికి ఎంతో సులువు అవుతుందని, ఈవీ వెహికల్ వలన అటు సమయం ఆదా కావడంతో పాటు సిబ్బంది అవసరం తక్కువ అవుతుందని జీడీఎక్స్ శానిటేషన్ కంపెనీ నిర్వహకులు రవికుమార్, శివాజీ లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు డా. జయకృష్ణ, డా. వెంకటరమణ, డా. రాము, డా. యోగేంద్ర, విజయ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద కుటుంబానికి అండగా
# ఎంఎల్ఏ సతీష్ కుమార్

**చిగురుమామిడి మే 16 (ప్రజామంటలు):** చిన్న ముల్కనూరు గ్రామానికి చెందిన బావండ్ల నవీన్ తండ్రి రవి అను అతనికి నిన్నటి రోజున యాక్సిడెంట్ జరిగి ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన విషయాన్ని తెలుసుకుని స్థానిక బిఆర్ఎస్ శ్రేణులు ఎంఎల్ఏ వొడితల సతీష్ కుమార్ కి తెలుపగ, చిగురుమామిడి మండల అధ్యక్షులు మామిడి అంజయ్య తో వారి కుటుంబంనికి దహన ఖర్చుల కొరకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముప్పిడి వెంకట నరసింహారెడ్డి, ఎంపీటీసీ పెసరి జమున రాజేశం, జిల్లా రైతుబంధు సభ్యులు సాంబార్ కొమురయ్య, మహిళా అధ్యక్షురాలు అందే సుజాత, మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర తిరుపతి, ఉపాధ్యక్షులు బరిగేల సదానందం, ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు పందిపల్లి రాజు, నాయకులు కయ్యం వీరయ్య, పందిపెల్లి బాబు, నగునూరి రాజు, భువనగిరి దిలీప్ కుమార్, అందే పోచయ్య, మారెళ్ళ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీపీఆర్‌పై అవగాహన సదస్సు

**కోరుట్ల టౌన్ మే 17 (ప్రజామంటలు):** కోరుట్లలోని పశు వైద్య కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో (సీపీఆర్) కార్డియో పల్మనరీ రిచిపిటేషన్ మీద జిల్లా మెడికల్ మరియు హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారి సౌజన్యంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ టి. మాధవరావు మాట్లాడుతూ.... సీపీఆర్ అనేది ఒక ప్రధాన మైన



ప్రక్రియ అని ఎవరికైనా ప్రారంభంలోనే వైద్య సేవలు అందాలని అలా అందని పక్షంలో సీపీఆర్ ద్వారా ప్రథమ చికిత్స చేయవచ్చని దీనిపై ప్రతి ఒక్కరు అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. మెట్టుపల్లి వైద్యాధికారి డా. రాజి రెడ్డి సీపీఆర్ పై నమూనా చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కృష్ణ దైద, డా. సురేష్ మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## బన్సీలాల్ పేటలో
# డెంగ్యూ నివారణ ర్యాలీ

### మంగళ, శుక్రవారాలు రెండు రోజులు డ్రై డే పాటించండి

**సికింద్రాబాద్ మే 16 (ప్రజామంటలు):** జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం బన్సీలాల్ పేటలో ఎంటమాలజీ డిపార్ట్ మెంట్ ఆద్వర్యంలో డెంగ్యూ నివారణ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటమాలజీ సూపర్ వైజర్ ఎస్. రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు దోమల నివారణలకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని,




ప్రతి మంగళ, శుక్రవారాలు రెండు రోజులు డ్రై డే గా పాటించి, లార్వా దశలోనే దోమలను నిర్మూలించాలని విజ్ఞప్తి చేశారు. తమ, తమ ఇండ్ల పరిసరాల్లో శుభ్రత పాటించి, చెత్త నిల్వలు లేకుండా చూడాలని కార్పొరేటర్ హేమలత కోరారు. కార్యక్రమంలో సిబ్బంది మహ్మద్ సాదిక్, శ్రీహరి, శివరాజ్, దయానంద్, రాజేశ్వర్, పాల్గొన్నారు.

## సీఎం కప్ 2023 క్రీడా పోటీలను
## ప్రారంభించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**సారంగాపూర్ మే 16 (ప్రజామంటలు):** సారంగాపూర్ మండల కోనాపూర్ గ్రామంలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గారు.అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎమ్మెల్యే ,క్రీడాకారులకు జెర్సీ లను అందజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున శ్రీనివాస్,





జెడ్పీటీసీ మనోహర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సురేందర్, పాక్స్ ఛైర్మెన్ మల్లారెడ్డి, కోఆప్షన్ అమీర్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్ గౌడ్, ఎంపిడిఓ రాజేందర్, ఎస్ఐ మనోహర్ రావు, సర్పంచులు, ఎంపీటీసీ లు, ఉప సర్పంచ్ లు, పిఈటి లు, గ్రామ, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు దగ్గరయ్యే ప్రణాళిక ఏదీ?

కర్నాటకలో కాంగ్రెస్ విజయంతో విపక్షాల్లో మెల్లగా కదలిక వస్తోంది. కలసి పోరాడాలన్న స్పృహ కలుగుతోంది. అయితే కాంగ్రెస్ లేకుండా విపక్షాల ఐక్యత అన్నది అసాధ్యం. మమతా బెనర్జీ వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఆత్మవిమర్శ చేసుకుని ముందుకు కదలాల్సి ఉంది. రాహుల్ జోడో యాత్రతో ప్రజల వద్దకు వెళ్లడం ద్వారా సమస్యలు తెలుసుకున్నానని అంటున్న రాహుల్.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ఎలా పరిష్కారం చూపుతారో తెలియచేయాలి. బిజెపిని గద్దెదింపుతామం టున్న విపక్షాలు కూడా ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారో బహిరంగంగా ప్రకటించాలి. ఆదానీ, అంబానీల విషయం కావచ్చు..రైతులకు మంచి చేసే వ్యవసాయ విధానం కావచ్చు..

ధరలు, గ్యాస్ ధరలు, పెట్రో ధరలు, జిఎస్టీ వాతలపై ప్రత్యమ్నాయ మార్గాలు ఏం తీసుకుంటారో చెప్పాలి.

కేవలం మోడీని ఓడించడమే లక్ష్యంగా గాకుండా..విపక్షాల వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనం తెలియ చేయాలి. ఇంతకాలం తమకు బడుగుబలహీన వర్గాలు,మైనార్టీలు అండగా ఉన్నారని భావించిన కాంగ్రెస్.. మోడీ వ్యతిరేకతతో మాత్రమే కర్నాటకలో గెలుపొందారని గుర్తించాలి. గత రెండు ఎన్నికల్లో బొక్కబోర్లా పడ్డది. రాష్ట్రాల ఎన్నికల్లోనూ అదే పరాభవం ఎదురయ్యింది. ఈ క్రమంలో కర్నాటకలో అంతకుముందు హిమాచల్‌లో గెలుపొందింది. ఈ సందర్భంగా ప్రజలతో అనుబంధాన్ని పునరుద్ధరించు కోవాల్సిన అవసరం ఉందని గుర్తించాలి. .దేశవ్యాప్తంగా మళ్లీ బలం పుంజుకోవడానికి, దూరమైన వర్గాలను దగ్గరకు చేర్చుకునేం దుకు పాదయాత్రలు, ఆందోళనలతో పాటు గట్టి నమ్మకాన్ని కలిగించే విధానాలు కూడా అవసరమే. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలపై విధాన ప్రకటనలు చేయాలి. ఇంత కాలం ప్రజలకు దూరంగా ఉంటూ వచ్చిన కాంగ్రెస్ ఇక కార్యక్రమాలు, ఆందోళనల ద్వారా ప్రజలకు చేరువ కావాలన్న సంకల్పం మంచిదే. అయితే ప్రజలు ఎందుకు దూరమ్యారో..వారిని ఎలా దరికి చేర్చుకోవాలో ఆత్మపరిశీల న కూడా అవసరమే. గత పదేళ్ల యూపిఎ హయాంలో జరిగిన పొరపాట్లను, కుంభకోణాలపై ప్రజలకు వివరణ ఇచ్చుకోవాలి. స్వాతంత్ర్యం తామే తెచ్చామని, అభివృద్ధి అంతా తమ హయాంలోనే జరిగిందని గొప్పలు చెప్పుకోవడం మానాలి. దేశవ్యాప్తంగా బలం పుంజుకోవడానికి, దూరమైన వర్గాలను దరిజేర్చు కునేందుకు కాంగ్రెస్ యాత్రలుచేపట్టడం మంచిదే అయినా..ప్రజలకు ఏంచేయబోతున్నారో.. చెప్పుకునేం దుకు సిద్దంగా ఉండాలి. ప్రజల సమస్యలపై స్పష్టమైన



అవగాహన, పరిష్కరించే చర్యలపై చర్చించాలి. భావి కార్యాచరణను, సంస్థాగత సంస్కరణలను ప్రముఖంగా ప్రస్తావించాలి. ప్రధాని మోదీ హయాంలో సమాజంలో వివిధ వర్గాల మధ్య సామరస్యం దెబ్బ తిందని.. సామరస్యాన్ని పరిరక్షించేందుకు, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు పూనుకుంటామన్న కాంగ్రెస్ సంకల్పం మంచిదే. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలపై ఎక్కడిక్కడ రాష్ట్రాల్లో ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు పార్టీని పూర్తి సన్నద్ధం చేసే క్రమంలో ప్రజలకు భరోసా కల్పించాలి. అన్ని స్థాయుల పదవుల్లో ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు ఇస్తున్న 20 శాతం ప్రాతినిధ్యాన్ని 50 శాతానికి పెంచాలని, ఉపకులాలకు కూడా అత్యధిక ప్రాధాన్యమివ్వాలని గతంలో ఉదయ్‌పపూర్ చింతన్ శిబిర్ నిర్ణయించింది. నిజానికి ఈ వర్గాలన్నీ తొలుత కాంగ్రెస్ వెన్నంటే ఉన్నాయి. కానీ ప్రకటలనకే పరిమితం అయిన వీరి పురోభివృద్ధి ఆచరణలో కానరాలేదు. కాలక్రమంలో ఈ వర్గాలన్ని క్రమంగా దూరం అవుతూ వచ్చాయి. దీంతో మళ్ళీ ఈ వర్గాలను దగ్గరకు చేర్చుకునే అవసరం ఏర్పడింది. ప్రజలను దూరం చేసుకున్నామన్న బాధను గుర్తించారు. అందువల్ల సుదీర్ఘ ప్రణాళిక అవసరం. పార్లమెంటు, అసెంబ్లీల్లో ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలని, మహిళా రిజర్వేషన్ బి ల్లు కోసం పోరాడాలని.. బలహీనవర్గాలు, మైనారిటీలకు ఇచ్చే కోటాలో మహిళలకూ ప్రాతినిధ్యం కల్పించాలి. అలాగే యువతకు పెద్దపీట వేసే దిశగా 2024 నుంచి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో సగం టికెట్లు 50 ఏళ్లలోపు వారికే ఇవ్వాల్సి ఉంది. పాతవారికే కాకుండా కొత్తతరాన్ని కూడా రాజకీయాలకు ఆహ్వానించాలి. 2024 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని.. పార్టీ సంస్థాగత స్వరూపం, పదవుల నియామక నిబంధనలు, కమ్యూనికేషన్లు, పబ్లిసిటీ, ప్రజలకు చేరువ కావడం, నిధులు, ఎన్నికల నిర్వహణ వంటి అంశాల్లో సంస్కరణలు ఉంటాయని చింతన్ శిబిరంలో తెలియచేశారు. అందుకు అనుగుణంగా సాగుతున్నామా లేదా అన్నది కూడా ప్రకటించాలి.

ప్రభుత్వరంగ సంస్థలను మోడీ ప్రభుత్వం విచ్చలవిడిగా అమ్ముతున్న క్రమంలో దీనిని అడ్డుకోవడానికి ఏం చేయబోతున్నారో చెప్పడంలేదు. కరోనా అనంతర విపత్క పరిస్థితుల్లో ఆర్థికరంగం కుదేలయ్యింది. దీన్ని ఎలా చేస్తే ముందుకు పోతామో ఓ విధానపత్రం ప్రకటించి ఉంటే బాగుండేది. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈవీఎంలను తొలగిస్తామని, వాటి స్థానంలో బ్యాలెట్లను పునరుద్ధరిస్తామని అంటున్నారు. ఇలా అన్ని విషయాల్లో కాంగ్రెస్ వైఖరి ఇదని ప్రకటించి ఉంటే ప్రజలు నమ్మేవారు. మొత్తంగా దూరమైన ప్రజలను దగ్గరకు చేర్చుకునే క్రమంలో ఎలాంటి విధానాలు ఉండబోతున్నాయో కూడా చెప్పగలగాలి. విపక్షలను కూడగడితే ప్రజలకు ఒనగూరే లాభం, దేశానికి కలిగే హితం ప్రకటితం కావాలి. అప్పుడే కాంగ్రెస్ పార్టీపైనా, ఐక్యత కోరుకుంటున్న విపక్షాలపైనా విశ్వసనీయత పెరుగుతుంది. అంతేగానీ కర్నాటక విజయంలో విర్రవీగితే మళ్లీ ఎదురుదెబ్బలు తప్పవు.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్

## సువర్ణ ముఖి

ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా తాతయ్య తీర్థ యాత్రలకు వెళ్ళి వచ్చాడు. తాను చూసిన ప్రసిద్ధి స్థలాల గురించి తన మనమళ్ళకు చెప్పేవాడు.

తాతయ్య రాగానే పిల్లలందరు చుట్టు ముట్టారు."తాతయ్య! ఈ సారి ఏ ప్రదేశం చూసారు" కుతూహలం ఆపు కోలేక అడిగింది రమణి."ప్రముఖ శైవ క్షేత్రం శ్రీకాళహస్తి కి వెళ్ళానర్రా"చెప్పాడు తాతయ్య. "శ్రీకాళహస్తి ఎక్కడుంది తాతయ్య!"అడిగాడు రాజేష్ ."ఆంధ్ర ప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతం చిత్తూరు జిల్లాలో ఉందర్రా"అన్నాడు తాతయ్య. "రాయలసీమ ప్రాంతంలో ఎన్ని జిల్లాలు ఉన్నాయి తాతయ్య " అడిగాడు నవీన్. "రాయలసీమ ప్రాంతంలో కర్నూలు , అనంతపురం ,కడప , చిత్తూరు ఉన్నాయి.చిత్తూరు జిల్లాలో శ్రీకాళహస్తి ఉంది." చెప్పాడు తాతయ్య. "శ్రీకాళహస్తి కి ఆ పేరు ఎలా వచ్చింది తాతయ్య!" ఆతృతతో అడిగింది రమణి. "మంచి ప్రశ్న వేసావు! శ్రీ అనగా సాలెపురుగు, కాళ అనగా నాగుపాము, హస్తి అనగా ఏనుగు. ఈ మూడు జంతువుల కలయిక వలన శ్రీకాళహస్తి అని పేరు వచ్చింది. ఆ ఊరులో శివాలయం, సువర్ణ ముఖి నది ప్రసిద్ధి చెందినది " చెప్పాడు తాతయ్య.



"సువర్ణ ముఖి నది గురించి చెప్పండి తాతయ్య" ఉత్సాహంగా అడిగాడు రాజేష్ . "అలాగేనర్రా! మరి చెపుతాను శ్రద్ధగా వినండి.స్వర్ణముఖి నది దక్షిణ భారత దేశంలో ప్రవహించే ఒక నది.

చిత్తూరు జిల్లాలో ప్రముఖ నది.ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తి ఈ నది ఒడ్డున వెలసి ఉంది. తిరుపతి– చంద్రగిరి మధ్య తొండవాడ సమీప కొండ ప్రాంతం ఈ నది జన్మ స్థానం.ధూరటి తన రచనల్లో దీన్ని 'మొగలేరు' అని ప్రస్తావించాడు. ఈ నది ఒడ్డున శ్రీకాళహస్తీశ్వర దేవా లయం ,తొండ వాడ వద్ద ఉన్న అగస్త్యేశ్వరాలయం ,యోగి మల్లవరం వద్ద ఉన్న పరాశరేశ్వరాలయం, గుడి మల్లం దగ్గరున్న పరశురామేశ్వరా లయం ,గాజుల మండ్యం దగ్గరున్న మూలస్థానేశ్వరాలయం ఉన్నాయి. ఇది జీవ నది కాదు.సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ దాకా ప్రవహిస్తుంది. ఈ

నది భీమ, కళ్యాణి నదులలో సంగ మించి,తొండ వాడ లో త్రివేణి సంగమంగా మారి, ఉత్తరవాహినిగా ప్రవహించి తూర్పున బంగాళాఖాతం లో కలుస్తుంది." వివరించి చెప్పాడు తాతయ్య. "జీవనది అంటే ఏమిటి తాతయ్య" అడిగింది సుమతి.

"జీవనది అంటే నీళ్ళు ఇంకిపోయినా హిమాలయాల మంచు కరిగి నీళ్ళుగా మారి ఎప్పుడు ప్రవహిస్తూ ఉండేవి." అన్నాడు తాతయ్య. "మరి జీవనదులు ఏవి తాతయ్య!" అడిగింది రమణి.

" చాలా ఉన్నాయర్రా! ముఖ్యంగా మన భారత దేశంలో గంగ, సింధు, బ్రహ్మ పుత్ర చెప్పవచ్చు" సందేహాన్ని తీర్చాడు తాతయ్య ." స్వర్ణ ముఖి కి ఆ పేరు ఎలా వచ్చింది తాతయ్య" మరో సందేహాన్ని వెల్లబుచ్చాడు రాజేష్ ."ఈ నది గురించి ఒక పురాణ గాధ ఉంది.పూర్వం అగస్త్య మహర్షి బ్రహ్మను గురించి తపస్సు చేసి నదిని దేవలోకం నుంచి క్రిందికి తెప్పించినట్లు స్థల పురాణం ద్వారా తెలుస్తుంది.శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని నిర్మించేటప్పుడు ఆలయ నిర్మాణంలో సహకరించిన కూలీలు రోజూ సాయంత్రం నదిలో స్నానం చేసి , ఇసుక వారి చేతుల్లోకి తీసుకుంటే నది వారు చేసిన కష్టానికి తగిన ప్రతిఫలంగా దాని విలువచేసేంత బంగారంగా మారేది. అందుకే ఈ నదికి సువర్ణముఖి, స్వర్ణముఖి అనే పేర్లు వచ్చాయి." చెప్పాడు తాతయ్య. "ఓహో ! స్వర్ణం, సువర్ణం అంటే బంగారం అన్న మాట " అన్నాడు నవీన్.

"స్వర్ణ ముఖికి 'మొగలేరు అని పేరు కూడా ఉందని అన్నారు కదా అదెలా వచ్చింది తాతయ్య!" సందేహాన్ని వ్యక్త పరచింది సుమతి. "ఇంకా ఆ ప్రశ్న అడగలేదేమని అనుకున్నా! అడిగేశావు గా! ఈ నదీ తీరంలో విపరీతంగా మొగలి పొదలు పెరిగిన కారణంగా స్వర్ణముఖి నదికికి "మొగలేరు" అనే పేరు వచ్చింది." నవ్వుతూ చెప్పాడు తాతయ్య. "ఆ నది పైన వంతెన ఉందా తాతయ్య!" అడిగింది రమణి.

"మరిచిపోయానర్రా! శ్రీకాళహస్తి నడి బొడ్డున ఉండి పట్టణాన్ని కలుపుతూ 'రామసేతు' వంతెన ఉంది" చెప్పాడు

తాతయ్య. "స్వర్ణముఖి నది గురించి చాలా మంచి విషయాలు చెప్పారు తాతయ్య.ఈ సారి మా పాఠశాల అందరం శ్రీకాళహస్తికి విహార యాత్రకు వెళతాము" ఆనందంగా అన్నాడు రాజేష్ . "అలాగే! ఈ సారి మరో తీర్థయాత్రకు వెళ్ళినప్పుడు మరో స్థలం గురించి చెబుతాను. మద్యాహానం అయ్యింది. అందరు భోజనానికి పదండి" అంటూ అందరితో లేచాడు తాతయ్య.

– కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

# టీకా సృష్టికర్త ఎడ్వర్ట్ జెన్నర్

## రోగ నిరోధక శాస్త్ర పితా మహుడు ఎడ్వర్ట్ జెన్నర్

### మే 17... ఎడ్వర్డ్ జెన్నర్ జయంతి

విధ వ్యాధులు సోకకుండా కాపాడు కోవడానికి, రోగ నివారణ కోసం వ్యాక్సిన్లు తీసుకోవడం సర్వ సాధారణ మై పోయింది. కుక్కకాటు, క్షయ, కలరా, కామెర్లు, మలేరియా, కేన్సర్ల వంటి వ్యాధులకు పూర్వం సరైన మందులు లేవు. ప్రధానంగా మానవాళి మనుగడకు పెను సవాలుగా నిలిచిన మశూచి వ్యాధి ప్రపంచ మంతా భయంకరంగా వ్యాపించి ఉండేది. ఇంగ్లండ్‌కు చెందిన ఎడ్వర్డ్ జెన్నర్ మహనీయుడు స్మాల్‌ఫాక్స్ వ్యాధి సోకకుండా ఉండటానికి వ్యాధి నిరోధక 'వాక్సినేషన్' మందు కనిపెట్టి మానవాళికి ఎంతో మేలు చేశాడు. వ్యాక్సిన్ అనే పదం 'వాకా' నుంచి వచ్చింది. వాకా అంటే ఆవు అని అర్థం.

స్మాల్‌పాక్స్ (మశూచి) క్రీ.పూ 3వ శతాబ్దం నుంచి మానవ చరిత్రలో ఈ వ్యాధి ప్రస్తావన కనిపిస్తుంది. 18వ శతాబ్ది నాటికి కాలనైజేషన్ కారణంగా ప్రపంచమంతా విస్తరించింది. దీనివల్ల కలిగే



మరణాలు భారీగా ఉండేవి. మశూచి అంటువ్యాధి. అయితే, దీనికి వ్యాక్సిన్ కనిపెట్టింది మాత్రం 1796వ సంవత్సరంలోనే బ్రిటన్ కు చెందిన డాక్టర్ ఎడ్వర్డ్ జెన్నర్ మశూచికి వ్యాక్సిన్ కనిపెట్టారు. ఒక వ్యాధికి అడ్డుకట్ట వేయడానికి తయారు చేసిన తొలి వ్యాక్సిన్ ఇదే. దీని వల్లే మశూచి మరణాల సంఖ్య గణనీయంగా తగ్గాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాక్సిన్ అందుబాటు లోకి రావడంతో 1980 నాటికి మశూచి అంతమైనట్లు అప్పటి వరల్డ్ హెల్త్ అసెంబ్లీ ప్రకటించింది.

జెన్నర్ ఒక ఆంగ్ల వైద్యుడు, మశూచి వ్యాక్సినేషన్ మార్గదర్శకుడు, రోగనిరోధక శాస్త్ర పితామహుడు.

ఎడ్వర్డ్ జెన్నర్ 1749 మే 17న గ్లౌసెస్టర్‌షైర్ లోని బర్కిలీలో జన్మించాడు. 14 సంవత్సరాల వయస్సులో, స్థానిక సర్జన్ వద్ద, తరువాత లండన్‌లో శిక్షణ పొందాడు. 1772లో, అతను బర్కిలీకి తిరిగి వచ్చాడు. అతని కెరీర్‌లో ఎక్కువ భాగం తన స్థానిక పట్టణంలో వైద్యుడిగా గడిపాడు.1796లో, అతను ఎనిమిదేళ్ల జేమ్స్ ఫిప్స్‌పై ఇప్పుడు ప్రసిద్ధి చెందిన ప్రయోగాన్ని చేశాడు.

జెన్నర్ కౌపాక్స్ స్ఫోటము నుండి తీసిన చీమును బాలుడి చేతిపై ఒక కోతలోకి చొప్పిం చాడు. తన ప్రయోగాన్ని వివరిస్తూ 1797లో రాయల్ సొసైటీకి ఒక పత్రాన్ని సమర్పిం చాడు, జెన్నర్ తన స్వంత 11నెలల కొడుకుతో సహ ఇతర పిల్లలపై ప్రయోగాలు చేశాడు. 1798లో, ఫలితాలు చివరకు ప్రచురించ బడ్డాయి.

మశూచి 16, 17 శతాబ్దంలో కొన్ని లక్షల మంది చావుకు కారణం అయిన వ్యాధి. ఎడ్వర్డ్ జెన్నర్ డాక్టర్ అయ్యాక గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం చేయడం ప్రారంభించాడు. మశూచి బాగా ప్రభలుతున్న కాలంలో డైరీ ఫారం లో పనిచేస్తూ కౌ ఫాక్స్ వ్యాధి వచ్చిన రైతులకు మశూచి సోకడంలేదని ఆయన గమనించాడు.

పశువుల నుంచి మనుషులకు సంక్రమించే కౌఫాక్స్‌తో బాధపడుతున్న ఒక వ్యక్తి అతను పనిచేసే డాక్టర్ దగ్గరకు వచ్చాడు. కౌఫాక్స్ సోకిన వ్యక్తులు స్మాల్‌ఫాక్స్ బారిన పడక పోవడాన్ని ఎడ్వర్డ్ గమనించాడు.ఈ పరిశీలనే స్మాల్‌ఫాక్స్‌కు వ్యాక్సిన్ తయారుచేసేలా తోడ్పడింది. మొట్టమొదట వ్యాక్సిన్ తయారుచేసిన పరిశోధకుడిగా చరిత్రలో నిలిచిపోయేలా చేసింది. ఎడ్వర్డ్ జెన్నర్‌కు ఫాదర్ ఆఫ్ ఇమ్యునాలజీ అని పేరుంది.

తన ఫ్రెండ్ అనుమతితో ఆయన కొడుకు అయిన జేమ్స్ మీద 1796 మే 14 న ఒక ప్రయోగం చేసాడు. కౌ ఫాక్స్ సోకిన వ్యక్తి శరీరం మీద వచ్చే బొబ్బ నుంచి వచ్చే స్రావాన్ని జేమ్స్ కి రాసేసి కౌ ఫాక్స్ వచ్చేలా చేశాడు. 6వారాల తర్వాత జేమ్స్ ని మశూచి కి గురిచేయగా, ఎటువంటి మసూచి లక్షణాలు కనిపించలేదు. ఇదే మశూచి వాక్సిన్ కనుగొనడానికి జరిగిన ప్రయత్నం.

వ్యాక్సిన్‌లోని పరిణామాలపై పరిశోధన, సలహాలు ఇవ్వడంలో ఎక్కువ సమయం గడిపాడు. జెన్నర్ అనేక ఇతర రంగాలలో పరిశోధన చేసాడు. శిలాజ సేకరణ, ఉద్యాన వనాలపై కూడా ఆసక్తిని పెంచు కున్నాడు. వ్యాధి నివారణలో మానవాళికి మహోపకారం చేసిన జెన్నర్ 1823 జనవరి 26న మరణించాడు.



–ఆర్కె సంగనభట్ల
9440595494

# పంట పొలాలను కాపాడుకుందాం

భారత దేశం వ్యవసాయక దేశం. 63 శాతం మంది ప్రధాన వృత్తి వ్యవసాయం. ప్రపంచంలో పండే అన్ని పంటలు కూడా భారతదేశంలో పండే సహజమైన భూమి, పండించే రైతులు, వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఒక లక్ష హెక్టార్ల వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా మారుతుంది. అది ముఖ్యంగా అభివృద్ధి పేరుతో రింగ్ రోడ్ల నిర్మాణం, పారిశ్రామికీకరణ, సాగునీటి ప్రాజెక్టుల



నిర్మాణం, రియల్ ఎస్టేట్ వ్యాపారం. ఎవ్వరు అభివృద్ధికి వ్యతిరేకులు కాదు. భారత దేశం ప్రపంచంలోనే జనాభాలో మొదటి స్థానంలో ఉంది. ఈ జనాభా కు ఆహారాన్ని అందించాలి. కాబట్టి వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మారిస్తే ఆహార భద్రతకే ప్రమాదం!

10 సంవత్సరాల క్రితం తెలంగాణలో పట్టణాల నుండి గ్రామాలకు వెళుతుంటే ఎక్కడచూసినా రోడ్డుకు రెండు వైపులా పచ్చటి పంట పొలాలతో కళకళలాడే పల్లె సీమలు. ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో పచ్చటి పంట పొలాలు వెంచర్లుగా మారి తెల్లారేసరికి ఆకర్షణీయమైన ఆర్చీలు, రోడ్లు, చుట్టూ గోడలు, ఫ్లెక్సీలు, అందమైన చెట్లు, టివి, పేపర్లలో పెద్ద పెద్ద అడ్వర్‌టైజ్‌మెంట్లు, అందమైన బ్రోచర్లు, గేట్లు, గేట్ల ముందు మన భాష రాని వాచ్‌మెన్లు. అంతేకాకుండా అద్భుతమైన పథకాల పేరుతో అరచేతిలో వైకుంఠం చూపిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారు. కొనుగోలుదారులు కూడా భవిష్యత్తులో దానిని పెట్టుబడిగా భావించి ఈ ప్లాట్లను ప్రజలు కొనుగోలు చేసి ఆ భూములను బీడు భూములుగా మారుస్తున్నారు.

ఒకప్పుడు నగరాలకు, పట్టణాలకే పరిమితమైన రియల్ ఎస్టేట్ వ్యాపారం గత ఐదు, ఆరు సంవత్సరాలుగా చిన్న చిన్న గ్రామాలకు విస్తరించి ఇవాళ గ్రామీణ ప్రాంతంలో ఇల్లు జాగా కూడా పేదవారికి అందని ద్రాక్షానే? ఇట్లా వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి దేశానికి ఆహార సమస్య వచ్చే పరిస్థితి దగ్గరలోనే ఉంది. మన రాష్ట్రంలో దాదాపు ఒక కోటి 67 లక్షల ఎకరాల సాగుకు యోగ్యమైన భూమి ఉండగా, గత పది సంవత్సరాలలో సుమారు 12 లక్షల ఎకరాల భూమి వ్యవసాయేతర భూమిగా మారిందంటే ఎంత వేగంగా వ్యవసాయ భూమి తగ్గుతూ వస్తుందో అర్థం చేసుకోవచ్చు! తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తర్వాత గ్రామాలలో భూస్వాముల కబంధహస్తాల నుండి భూములు విముక్తి చెంది అప్పటి వరకు భూమిలేని పేదలు చిన్న, సన్నకారు రైతులుగా అవతరించి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కానీ ఇప్పుడు రాష్ట్రంలో నయా భూస్వామ్య విధానం అమలవుతుంది. 'వ్యవసాయం చేసే వారికి భూమి ఉండటం లేదు. భూమి ఉన్న వారు వ్యవసాయం చేయడం లేదు'.

1948 కంటే ముందు ఆయా గ్రామాల్లో ఉండే భూములు ఏ భూస్వామిదో తెలిసేది, ఆ భూములన్నీ ఆ గ్రామస్థులే కౌలుకు లేదా పాలుకు చేసుకుంటూ ఆ రైతులు, రైతు కూలీలు పశువులను, గొర్లు, మేకలను మేపుకుంటూ, కాయలు, పండ్లు కట్టేలతో వాళ్ళ అవసరాలు తీర్చుకొని బతికేవారు. ప్రస్తుతం నగరాలు, పట్టణాలలో ఉండి బాగా డబ్బులు సంపాదించినవారు ఇప్పుడు వ్యవసాయ భూమి సామాజిక హోదాగా భావించి నయా భూస్వాములుగా అవతరించి వెంచర్లు, ఫామ్ హౌస్‌ల పేర్లతో లక్షల ఎకరాల వ్యవసాయ భూమిలుకొని చుట్టూ గోడలు పెట్టి, అందులో చిన్న ఇల్లు కట్టి గేటుకు తాళం వేసి ఆ భూమిని బీడు భూమిగా ఉంచి ఆ పట్టేదారు ఎవరో కూడా ఆ గ్రామస్థులకు తెలియదు. సెలవు రోజులలో ఆ పట్టేదార్లు భార్య పిల్లలతో లేదా స్నేహితులతో వచ్చి జలసాలు చేసి పోతుంటారు. గతంలో కేవలం గడీలకు మాత్రమే గోడలు ఉండేవి? ఇప్పుడు పచ్చటి పంట పొలాల చుట్టూ గోడలు దేనికి సంకేతమో? ఇప్పుడు ఒక సామాన్య రైతు తన పొలం దగ్గరికి వెళ్లాలంటే ఆ గోడల చుట్టూ తిరిగి సుమారు రెండు కిలోమీటర్లు దూరంలో తన పొలం దగ్గరికి పోయే పరిస్థితి ఆ గోడలు సృష్టిస్తున్నాయి. దొరల ఇండ్ల చుట్టూ ఉండే గోడలను గడీలు అనే వారం.

ఇప్పుడు పంట పొలాల చుట్టూ ఉండే గోడలను ఏమని పిలవాలి?

ఇప్పుడు తెలంగాణ రైతులు కోటీశ్వరులు అంటున్నారు. రాష్ట్రంలో 'భూమిని అమ్ముకుంటే కోటీశ్వర్లు, అదే భూమిని నమ్ముకుంటే ఆత్మహత్యలు'? రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా ఒక ఎకరా భూమి ధర సుమారు 20 లక్షల నుంచి రెండు కోట్లకు పైగా ధర పలుకుతుంది. ఇది ఒకరకంగా భూమి ఉన్న రైతులకు భూమి విలువ పెరగడంతో సామాజిక హోదా, మానసికస్థైర్యం ఆ కుటుంబానికి వస్తుంది. కానీ మన రాష్ట్రంలో సుమారు 86% చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. కొంత మంది రైతులు భూములను అమ్మడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇందుకు వారి ఆర్థిక పరిస్థితులు, అవసరాలు, వ్యవసాయంలో వచ్చిన నష్టాలు అనేక కారణాల వల్ల భూములు అమ్మడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు.

ఇప్పుడు వ్యవసాయ భూములు అమ్ముకోవడం తప్ప మళ్ళీ భూములను కొనే స్థితిలో రైతులు లేరు. భూముల రేట్లు ఆకాశాన్ని అంటడం చాలా దుష్పరిణామం. గతంలో గ్రామాలలో వ్యవసాయ భూమి అమ్మితే ఆ గ్రామస్థులు మాత్రమే ఆ భూమిని కొనేవారు, ఆ కొన్న భూములకు రూపాయలు వాయిదాల పద్ధతిలో పంటల మీద రెండు, మూడు సంవత్సరాలు వరకు కట్టేవారు. ధరలు పెరగడంతో ఆగ్రామ భూములు ఆ గ్రామస్థులు కొనే స్థితిలో లేరు. ఏ ధరలైన సామాన్యులకు అందుబాటులో ఉండాలి. ఇప్పుడు భూములు అమ్ముకుంటే 45 రోజులలో మొత్తం డబ్బులు కట్టేసి కనీసం గ్రామస్థుల సాక్షి సంతకాలు లేకుండా రిజిస్ట్రేషన్, పట్టాలు చేయించుకుంటున్నారు. ఇట్లా కొన్న లక్షల ఎకరాల భూములు బీడు భూములుగా మారుతున్నాయి. దీనితో ఆహార సమస్యతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పని దొరకక నిరుద్యోగం పెరిగే అవకాశం ఉంది.

యువత తప్పు తోవ పట్టే పరిస్థితి ఉంది. వ్యవసాయ భూములు ప్లాట్లుగా మార్చి అమ్మిన నాలా కన్వర్షన్ చేయించడం లేదు ఎందుకంటే ఆ భూములు వ్యవసాయ భూములుగా ఉంటే ఆ పట్టేదారులకు రైతు బంధు, 5 లక్షల రూపాయల రైతు బీమా వస్తుంది. వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా మార్చడానికి ప్రభుత్వాలు నియంత్రించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన నష్టం ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇష్టం వచ్చినట్లు వ్యవసాయ భూములను లేఔట్లుగా మారకుండా అవసరమైన మేరకే అనుమతులు ఇవ్వాలి. ఇప్పుడు జరుగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం అంతా 'వెంచర్లలో ఇండ్లు కట్టుకోరు, ఫామ్ హౌస్‌లలో పంటలు పండించరు'. కేవలం పెట్టుబడిగా భావించే వాటిని కొనుగోలు చేసి పెట్టుకుంటున్నారు. వ్యవసాయ భూములను రక్షించాలి, ఆ గ్రామాల భూములు ఆ గ్రామస్థులే కొనుగోలు చేసే విధంగా ధరలు అందుబాటులో ఉండాలి, కొన్న ప్రతి గుంటలో పంటలు పండించే నిబంధన పెట్టాలి.

## పదకవితా పితామహుడు అన్నమయ్య

### ఆయన కీర్తనలు అజరామరం

పదకవితా పితామహుడు, తొలి తెలుగు వాగ్గేయ కారుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు. సర్వజీవులలో సర్వాత్మలకు ఆత్మ అయిన శ్రీహరిని చూస్తూ, తత్ఫలితంగా సమస్తాన్నీ ఆ భగవంతుని సంబంధంలోనే చూసే వాడు, సమస్తం ఆ దేవదేవునిలోనే నిత్యవిలసితమై ఉన్నదని ఎరిగి ఉండే వాడే భాగవతోత్తముడు'. ఈ నిర్వచనానికి నిలువెత్తు నిదర్శనం... మన భక్త కవితా పితామహుడు అన్నమయ్య. వారి తల్లిదండ్రులు శ్రీమాన్ నారా యణసూరి, లక్కమాంబ. వైశాఖ పూర్ణిమనాడు జన్మించిన అన్నమయ్య 95 సంవత్సరాలు శ్రీవేంకటేశ్వరుని సంగీతమయ ఆరాధనలో తన్మయులై జీవించారు...శ్రీ వేంకటేశ్వరుడి పరమభక్తుడు, పదకవితాపితామహుడు అయిన అన్నమయ్య తిరుమలలో ఘనముని అనే గురువు వద్ద వైష్ణవ మతాన్ని స్వీకరించారు. కానీ వైష్ణవమత ప్రచారకర్త, విశిష్టాద్వైత సిద్ధాంతవేత్త అయిన రామానుజాచార్యులనే పరమగురువుగా భావించారు. ప్రత్యక్షంగా చూడకపోయినా, ఆయన బోధనలనే అనుసరించారు. రామా నుజులపై కీర్తనలు కూడా రచించారు. 'గురుకృప వల్లనే వేద రహస్యాలు తెలుసుకోగలిగాను. అహంకారాన్ని పోగొట్టి శరణాగత తత్త్వాన్ని అలవరచారు' అంటూ 'గతులన్ని ఖిలమైన కలియుగ మందును... గతి ఈతడే చూపె ఘన గురు దైవము' అంటూ సంకీర్తించారు. సుమారు 32,000 కీర్తనలు శ్రీవేంకటేశ్వరుని ప్రీత్యర్థం పాడిన మహోన్నత ధన్యజీవి మన అన్నమయ్య.శ్రీమహావిష్ణువు 'నందక'మనే ఖడ్గం అంశతో జన్మించిన అన్నమాచార్యులు భగవదాజ్ఞపైనే రోజుకొక కీర్తన రాసే సంకల్పంతో ముందుకు సాగి, స్వామి దివ్యానుగ్రహానికి పాత్రులయ్యారు. 'భగవత్కీర్తనతో పరవశించే తన నాలుక ఇతరులను కీర్తించదని' నిక్కచ్చిగా పలికిన కారణంగా ఆయన ఆనాటి రాజు క్రోధానికి గురై, కారాగారానికి కూడ వెళ్ళారు. కానీ, శ్రీవేంకటేశ్వరుని కీర్తనా మహిమతో ఆయన చేతులకు వేసిన గొలుసులు వాటంతటవే తొలగి కింద పడ్డాయి. 'అదివో అల్లదివో శ్రీహరి వాసము..' అంటూ ప్రారంభమైన శ్రీఅన్నమయ్య అద్భుత కీర్తనాఝరి నిరంతరం స్వామివారి సమస్త కల్యాణ గుణాలను, పండుగలను, విలాసాలను, లీలలను, భక్తరక్షణ కార్యాలను ఆద్యంతం అభివర్ణిస్తుంటే, అందరం అలా మైమరిచి, పులకితులం కావాల్సిందే. వారి కీర్తనలలో సుమారు 12,000 మాత్రమే ఇప్పుడు లభ్యమవుతున్నాయి. శ్రీఅన్నమాచార్యులు జన్మించిన ఊరు కడప జిల్లా రాజంపేట తాలూకాలోని తాళ్ళపాక. ఆ ఊరే ఆయనకు ఇంటిపేరు అయింది. తిమ్మక్క, అక్కలమ్మ ఆయన సతీమణులు. అన్నమయ్య వంశీకులుకూడ మంచి కవులు. 'చందమామ రావో జాబిల్లి రావో' అని ఆయన రాసిన పాటను ప్రతీ ఇంట శాశ్వతంగా ప్రేమతో తల్లులు పాడుకుంటారు. 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే', 'పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా', 'బ్రహ్మ కడిగిన పాదము', 'కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు', 'ముద్దుగారే యశోద', 'ఏమొకో చిగురుటధరమున'.. వంటి ఎన్నెన్నో భక్తి కీర్తనలు తిరుమల కొండలలో, భక్తుల గుండెల్లో నిరంతరం మారుమోగుతూనే ఉంటాయి.

# ఉగ్రరూపం దాలుస్తున్న భానుడు

### మండుటెండలతో జనం విలవిల

### ఉదయం నుంచే రోడ్లన్నీ నిర్మానుష్యం

**నిజామాబాద్,మే16(ప్రజా మంటలు):** రోజురోజుకూ భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఎండ తాపానికి ఉమ్మడి జిల్లా ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో 38 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7 నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండగా, మధ్యాహ్నం 12 దాటిందంటే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటింది. ఉభయ జిల్లాల్లో ఎండలు దంచి కొడుతున్నాయి. ఉక్కపోతతో జనాలు బయట మాత్రమే కాదు, ఇంట్లో కూడా వేడిమితో అల్లాడుతున్నారు. చెమట, ఉక్కపోత కారణంగా ఏమాత్రం అనుకూలంగా ఉండడంలేదు. ఎన్ని ఫ్యాన్లు, ఏసీలు ఉన్నా శరీరం వేడిగానే ఉంటుంది. ఇంట్లో ఉండలేం, బయటికి వెళ్లలేకపోతున్నాం. వారం క్రితం వరకు భారీ వర్షాలు కురిసి.. ఇప్పుడు ఎండలు దంచి కొట్టడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. డోంగ్లీ మండల కేంద్రంలో అత్యధికంగా 44.5 డిగ్రీలు, కనిష్ఠంగా తాడ్వాయిలో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బీర్కూర్ మండల కేంద్రంలో 42.3 డిగ్రీలు, బాన్సువాడ మండలం కొల్లూర్, బిచ్కుంద మండలం పుల్కల్‌లో 42, భిక్కనూరు మండలంలో 41.9, గాంధారి మండలం సర్వాపూర్‌లో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కామారెడ్డి జిల్లాలోని 12 మండలాలు ఆరేంజ్ జోన్‌లోకి వెళ్లాయి. ఉమ్మడి జిల్లాలోని నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, కామారెడ్డి, ఆర్మూర్ పట్టణాల్లో సగటున 38 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. బస్సులు, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించే వారు ఎండ వేడిమి, ఉక్కపోతను తట్టుకోలేక సతమతమవుతున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు శీతల పానీయాలను సేవిస్తున్నారు. కూల్‌డ్రింక్ షాపులు, జ్యూస్ స్టాళ్ల వద్ద సందడి పెరిగింది. వాతావరణంలో మార్పుల కారణంగా గాలిలో తేమశాతం పెరగడంతో ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు వేడిని తట్టుకోలేక రాత్రంతా సరిగా నిద్రపోవడంలేదు. ఒకేసారి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని



రోడ్లపై ఆరబెడుతున్న రైతులు.. ఎండ వేడిమిని తట్టుకోలేక చెట్లకింద సేదతీరుతున్నారు. భవన నిర్మాణాల పనులు వేగవంతం కావడంతో కూలీలపై ఎండ ప్రభావం పెరుగుతున్నది. దినసరి కూలీలు, చిరు వ్యాపారులు మధ్యాహ్నం వేళ తమ పనులను వదిలి ఇండ్లకు వెళ్లిపోతున్నారు. ఎండల ప్రభావం కూరగాయలు, తోటలపై కూడా పడుతున్నది. పశువులు సేద తీరేందుకు పొద్దంతా చెరువులు, కుంటల్లోనే ఉంటున్నాయి. వాతావరణ మార్పులతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అవుట్ పేషెంట్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. సాధారణంగా మే నెలలో ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. కానీ ఈసారి ఉష్ణోగ్రత 45 డిగ్రీలకు చేరడంతో వేడిమిని భరించలేకపోతున్నారు.

సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైనే తలపై టోపీ, రుమాలు, కాటన్ దుస్తులతో వెళ్లాలి.

# ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

### బస్తీ దవఖానాను ప్రారంభించిన తలసాని

**హైదరాబాద్,మే16(ప్రజా మంటలు):** ప్రజల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఇవాళ గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని గన్ ఫౌండ్రీలో గల నేతాజీ కమ్యునిటీ హాల్‌లో, జంబాగ్ డివిజన్‌లోని సుబాన్‌పురా కమ్యునిటీ హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలను మంత్రి శ్రీనివాస్ యాదవ్.. ఓఎం రాజాసింగ్, ఓఎల మిర్జా రహమత్ బేగ్‌లతో కలిసి ప్రారంభించారు. గన్ ఫౌండ్రీ బస్తీ దవాఖానాలో మంత్రికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు.

సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వైద్య సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి చెప్పారు. పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఈ బస్తీ దవాఖానలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉఊఓఅ పరిధిలో ఇప్పటి వరకు 350 బస్తీ దవాఖానల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్ జిల్లా పరిధిలో ఇప్పటికే 153 బస్తీ దవాఖానలు పని చేస్తుండగా, నూతనంగా 14 బస్తీ దవాఖానలు ప్రారంభించనున్నట్లు వివరించారు. బస్తీ దవాఖానలలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా మందులు కూడా ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు మంత్రి తలసాని. అవసరమైతే గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ఆసుపత్రులకు రిఫర్ చేస్తారని అన్నారు. వైద్య సేవల కోసం పేద ప్రజలు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

దీనిని దృష్టిలో ఉంచుకొని వందల కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా అభివృద్ధి





చేసినట్లు తెలిపారు. బస్తీ దవాఖానల ఏర్పాటు తర్వాత వైద్య పరీక్షల కోసం ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్ళేవారి సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు.కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. అన్ని రకాల వైద్య సేవలు, గుండె మార్పిడి, మోకాళ్ళ చికిత్స, కిడ్నీ మార్పిడి వంటి అనేక ఆపరేషన్‌లను ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగానే చేస్తున్నట్లు వివరించారు. వేలాది రూపాయల విలువైన టెస్టులను కూడా ఉచితంగానే చేస్తున్నట్లు చెప్పారు.

ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకట్, కార్పొరేటర్‌లు సురేఖ, రాకేశ్ జైశ్వాల్, మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా, డాక్టర్ మేరీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి నందకిషోర్ వ్యాస్, నాయకులు ఆనంద్ గౌడ్, ధన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా గంజాయి రవాణా

### అంతర్ రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్

**నల్లగొండ,మే16(ప్రజా మంటలు):** అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి.. నిందితులను పట్టుకున్నామని జిల్లా ఎస్పీ కే.అపూర్వ రావు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 43 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒక మహిళ కూడా ఉంది. నిందితుల నుంచి 103 కిలోల గంజాయి, 5 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ప్యాకెట్ల విలువ సుమారు రూ. 10 లక్షల వరకూ ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసును చేధించిన టాస్క్ ఫోర్స్, కేతపల్లి పోలీసులకు అభినందనలు తెలియజేశారు.ఇతర రాష్ట్రాల నుంచి ఎన్‌హెచ్ 65పై ప్రయాణిస్తున్న వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఈ సమయంలో కొర్లపాడ్ టోల్ గేట్ వద్ద అనుమానం వచ్చిన వాహనాలను తమ టీమ్ సభ్యులు తనిఖీలు చేస్తున్నారని, ఇందులో భాగంగానే నిందితులు పట్టుబడ్డారని ఎస్పీ కే.అపూర్వరావు చెప్పారు.ఒరిస్సాకు చెందిన గంజాయి వ్యాపారం చేసే వినయ్ అనే వ్యక్తి ద్వారా గంజాయిని హైదరాబాద్ కు తరలిస్తున్నట్లు నిందితులు పోలీసుల విచారణలో అంగీకరించారు. వినయ్ కు తెలిసిన వ్యక్తి వివేక్ వద్ద నుంచి సరఫరా చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని, వారిలో ఒక్కొక్కరికి రూ. 10,000 నిర్వాహకులు ఇచ్చినట్లు ముఠా సభ్యులు తెలిపారని పోలీసులు వెల్లడించారు. గంజాయి తరలించే వాళ్లంతా కూలీలుగా గుర్తించారు.

## బీసీలకు రాజ్యాధికారంతోనే న్యాయం

### బిసి గణన జరగాలన్న అభిప్రాయం

**నిజామాబాద్,మే16(ప్రజా మంటలు):** బిసిలను అణగదొక్కుతూ ఇప్పటికీ అగ్రవర్ణాలే రాజ్యమేలుతున్నారని బీసీ సంక్షేమసంఘ నేతలు ఆరో పించారు. బీసీలకు సామాజిక భద్రత కల్పించడానికి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా బీసీ యాక్టును తీసుకురావాలని డిమాండ్ చేశారు. అరవై ఏళ్ల స్వాతంత్ర్యదేశంలో బీసీలకు అన్నివిధాలా అన్యాయం జరిగిందన్నారు. జనాభాప్రాతిపదికన బీసీలకు చట్ట సభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరముందని చెప్పారు.

చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్ల మెంటులో బీసీబిల్లును పెట్టాలని అన్నారు. ముస్లింలకు బీసీలతో కాకుండా ప్రత్యేకకోటా ద్వారా రిజర్వేషన్లు వర్తింపజేయాలని సూచిం చారు. ఈమేరకు కేంద్రానికి నివేదించాలన్నారు. విదేశీయులైన ఆంగ్లో-ఇండియన్లకు నామినేటెడ్ ఎమ్మెల్యేలు, ఎంపీలుగా నియమిస్తున్నారని, అయితే భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడంలేదని వాపోయారు. ఈ విధానం వల్ల ఇంకా ఆంగ్లో ఇండియన్లు ఇక్కడ ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తం చేశారు.

# తెలంగాణలో బలపడుతున్న కాంగ్రెస్

### బిఆర్ఎస్‌తో పొత్తు అవకాశం లేదు

### ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేరే

**హైదరాబాద్,మే16(ప్రజా మంటలు):** తెలంగాణలో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రశ్నేలేదని ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేరే అన్నారు. కర్నాటక తరహాలో రాష్ట్రంలోనూ కాంగ్రెస్ బలపడుతున్నదన్నారు. ప్రజానుకూల ఎజెండాతో తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎ స్ తోనూ తమ ఎన్నికల పోరాటమని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ మొదట తెలంగాణలో వంద సీట్లు గెలిచాక ప్రధానమంత్రి పదవి గురించి మాట్లాడాలన్నారు.

తెలంగాణలోఎన్నికల మేనిఫేస్టోను స్థానిక నేతలే నిర్ణయిస్తారని చెప్పారు. ఇక్కడి సమస్యలపై వాళ్లకే ఎక్కువగా అవగాహన ఉంటుందన్నారు. బీఆర్ఎస్ సర్కారు వైఫల్యాలను ఎండగట్టడం ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ బాధ్యత అన్నారు.కేంద్రం తప్పుడు విధానాలపై తమ పోరాటం సాగుతుందని ఆయన చెప్పారు. విద్వేష ప్ర సంగాలపై చర్యలు తీసుకోవాలని ఇదివరకే సుప్రీంకోర్టు చెప్పిందని, ఆ మేరకే కర్నాటకలో బజరంగ్ దళ్ ను నిషేధిస్తామని కర్నాటక మేనిఫేస్టోలో పెట్టినట్టు పవన్



ఖేరే చెప్పారు. తెలంగాణలో సీఎం ఎవరుండాలనేది సీఎల్పీ నిర్ణయిస్తుందన్నారు. సరైన సమయంలో ఏఐసీసీ సరైన నిర్ణయం తీసుకుంటుందన్నారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్ద పీట వేస్తుందని, తామపార్టీ ప్రభుత్వం అధికారం లోకి రాగానే కులగణన చేపడుతుందని ఖేరే చెప్పారు.

# అటవీ సంరక్షణ ప్రధాన అధికారిగా డోబ్రియాల్

### సిఎస్‌ను మర్యాదపూర్వకంగా కలసిన అధికారి

**హైదరాబాద్,మే16(ప్రజా మంటలు):** తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధాన అధికారిగా రాకేశ్ మోహన్ డోబ్రియాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పని చేసిన పీసీసీఎఫ్ పదవీ విరమణ చేయడంతో డోబ్రియాల్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగిం చింది. తాజాగా ఆయనకు పూర్తిస్థాయిలో పీసీసీఎఫ్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో అరణ్య భవన్‌లో ఆర్ఎం డోబ్రియాల్ బాధ్యతలు స్వీకరించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతకు అనుగుణంగా, హరిత తెలంగాణ సాధనకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది పని చేస్తామన్నారు.



ఇదిలావుంటు డోబ్రియల్ సిఎస్ శాంతికుమారిని మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

## యాదాద్రీశుడికి భారీ ఆదాయం

### ఒక్కరోజులోనే రూ. 26,86,327 రాబడి

**యాదగిరిగుట్ట,మే16(ప్రజా మంటలు):** యాదగిరి గుట్టలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి ఆదాయం పెరుగుతుంది. మంగళవారం ఒక్కరోజే ఆలయానికి రూ. 26,86,327 వచ్చిందని ఆలయ అధికారులు ధాన బుకింగ్ ద్వారా రూ. 3,85,742 , కైంకర్యముల ద్వారా రూ. 2,001 , సుప్రభాతం ద్వారా రూ. 6,900 , బ్రేక్ దర్శనం ద్వారా రూ. 1,62,300, వ్రతాల



ద్వారా రూ. 1,43,200, వాహన పూజల ద్వారా రూ. 11,000 ఆదాయం సమకూరిందని తెలిపారు. వీఐపీ (÷ఎఎఖ) దర్శనం ద్వారా రూ. 1,05,000, ప్రచారశాఖ ద్వారా రూ. 18,750, పాతగుట్ట ద్వారా రూ. 34,870 , కొండపైకి వాహన ప్రవేశం(÷ఎ।తతిఇ్ణ।÷ ఇనిబిసాబ) ద్వారా రూ. 3,50,000, యాదఋషి నిలయం ద్వారా రూ. 84,446, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ. 1,29,148 ఆదాయం వచ్చిందన్నారు. శివాలయం ద్వారా రూ. 8,200, పుష్కరిణీ ద్వారా రూ. 1050, ప్రసాదవిక్రయం ద్వారా రూ. 10,62,300, శాశ్వత పూజల ద్వారా రూ. 25,000, కళ్యాణ కట్ట ద్వారా రూ. 83,500 , అన్నదానం(ఒనినిజీటజీనిజీప) ద్వారా రూ. 12,565, లిజెన్ లీగల్ ద్వారా రూ. 56,355, ఇతరముల ద్వారా రూ. 4000 ఆదాయం స్వామివారికి వచ్చిందని పేర్కొన్నారు.

## బాలింత మృతితో కుటుంబీకుల ఆందోళన

### డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్

**మహబూబాబాద్,మే16(ప్రజా మంటలు):** మరిపెడ గ్రామంలో డాక్టర్ల నిర్లక్షంతో బాలింత మృతి చెందిందంటూ బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఖమ్మం - వరంగల్ జాతీయ రహదారిపై డెడ్ బాడీతో ఆందోళనకు దిగారు. బాలింత మృతికి కారణమైన డాక్టర్ రవిని సస్పెండ్ చేసి బాధిత కుటుంబానికి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు అండదండలతో తమను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ విలేజ్ కి చెందిన వద్దూరి భాగ్యలక్ష్మి (25) మే 15 మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రవి నార్మల్ డెలివరీ చేశారు. గతంలో ఒక బాబు ఉండగా ఇప్పుడు మగ బిడ్డకు జన్మనిచ్చింది భాగ్యలక్ష్మి. డెలివరీ సమయంలో చిన్న ఆపరేషన్ చేసి బేబీని బయటికి తీశారు. అయితే బ్లీడింగ్ కంట్రోల్ కాకపోవడంతో ఎమ్జర్గ÷న్సీ కేసుగా నిర్ధారించి మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్ కి అంబులెన్సులో తరలించారు. అప్పటికే చనిపోయినట్లు డాక్టర్స్ నిర్ధారించడంతో మృతురాలి బంధువులు మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు డెడ్ బాడీతో ఆందోళనకు దిగారు. డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే చనిపోయిందని బంధువులు ఆరోపించారు. ఇవాళ మరోసారి ఖమ్మం వరంగల్ హైవేపై ఆందోళనకు దిగారు.రాష్ట్రంలో నార్మల్ డెలివరీలు బాలింతల ప్రాణాలు తీస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వరుసగా జరుగుతోన్న ఘటనలు కలవరపెడుతున్నాయి. కరీంనగర్ మాతాశిశు సంరక్షణ కేంద్రంలో గత 15 రోజుల్లో ముగ్గురు శిశువులు, ఒక బాలింత చనిపోయారు.

## డిసిఎంను ఢీకొన్న లారీ

### నలుగురు వ్యక్తులు దుర్మరణం

**రంగారెడ్డి,మే16(ప్రజా మంటలు):** జిల్లాలో సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డీసీఎంను సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న





లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు అక్కడిక్కడే మృతి చెందారు. ఈ ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కయాంజల్ కూడలి వద్ద జరిగింది. సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ వేగంగా వచ్చి డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా.. వారి వివరాలు మాత్రం తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## అభివృద్ధి పనులపై సమాచార సేకరణ

### గ్రామ సమస్యలపైనా వివరాలు నమోదు

**ఖమ్మం,మే16(ప్రజా మంటలు):** మంత్రి నిరంతర సమీక్షలతో అధికారు లను పరగులు పెట్టిస్తున్నారు. ప్రధానంగా గ్రామస్థాయిలో అన్ని సమస్యలను ఆకళింపు చేసుకోవాలని, అడిగిప్పుడు సమాచారం అందించేలా చూడాలని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అధికారులకు స్పష్టత ఇచ్చారు. దీంతో గ్రామాల్లోకి వెళ్లినప్పుడు అధికారులు సమాచార సేకరణ చేస్తున్నారు. ఎంపీడీవోలు గ్రామాల సందర్శన సమయంలో అంగన్‌వాడీలు, గురుకులాలు, పీహెచ్‌సీలను కూడా పరిశీలించి అందులో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, విద్యార్థులు, రోగులకు ఎలాంటి సౌకర్యాలు



అందుతున్నాయని ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించాలని మంత్రి సూచించారు. దీంతో అధికారులు ఈ మేరకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో అధికారులు సందర్శన చేస్తూ అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించడంతో పాటు గ్రామాల్లో బీటీ రోడ్లపై దమ్ముచక్రాల ట్రాక్టర్లు తిరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లలోని మురుగునీరు రోడ్లపైకి రాకుండా అధికారులు ప్రజలకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని, మిషన్ భగీరథ పనుల్లో భాగంగా పైపులైన్లు ఏర్పాటు చేసే సమయంలో రోడ్డుకు ఇరువైపులా హరితహారం మొక్కలు తొలగించకుండా చూసుకోవాలని, టెలిఫోన్ కేబుల్ వైర్లు కూడా తెగిపోకుకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల మంత్రి మండలాల వారీగా పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులతో అధికారులు సమర్ధవంతంగా పనులు చేయించాలని, ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



భీమదేవరపల్లి మండలం ములుకనూర్ లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులకు భూమి పూజ చేసిన జడ్పీటీసీ వంగ రవి, గ్రామ సర్పంచ్ మాడుగుల (ప్రెస్) కొమురయ్య, ఎంపీపీ జక్కుల అనిత - రమేష్, ఎంపీడీఓ లంకపల్లి భాస్కర్, మండల విద్యాధికారి అప్పని వెంకటేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ గుడికందుల పూర్ణచందర్, అప్పని బిక్షపతి తదితరులు

# జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం

### హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గా గాడిపల్లి హరీష్



**భీమదేవరపల్లి మే 16 (ప్రజామంటలు):** మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన గాడిపేల్లి హరీష్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున్, రాష్ట్ర అధ్యక్షుడు మాడ రాజు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గాడిపేల్లి హరీష్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో హుస్నా బాద్ నియోజకవర్గ కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర అధ్యక్షులకు హరీష్ ధన్యవాదాలు తెలిపారు. చేనేత ఐక్య సంఘం వేదిక సంఘాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

# మైనర్లు డ్రైవింగ్ చేస్తే వాహన యజమానిపై కేసు నమోదు

### - సీఐ ప్రవీణ్ కుమార్

**భీమదేవరపల్లి మే 16 (ప్రజామంటలు):** పోలీస్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఎల్కతుర్తి సి.ఐ., ముల్కనూర్ ఎస్సై మహేందర్ ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను తనిఖీ చేసి పట్టుకున్నారు. ఈ



సందర్భంగా సిఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సరైన ఆధారాలు లేకుండా, నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుపడితే వారి తల్లిదండ్రుల పైన, వాహనాలు ఇచ్చిన యజమానుల పైన కేసులు నమోదు చేస్తామన్నారు. వారి వెంట ఎస్ హెచ్ఓ రాజిరెడ్డి, కానిస్టేబుల్ పరికి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### టెన్త్‌లో 10 జిపి సాధించిన

# శ్రీ గద్దె తేజస్విని

### సన్మానించిన ఎంపీపీ

**కోరుట్ల రూరల్ మే 17 (ప్రజామంటలు):** పదో తరగతి పరీక్ష ఫలితాలలో కోరుట్ల మండలంలోని కల్లూరు మోడల్ స్కూల్లో చదివిన గుమలాపూర్ విద్యార్థి శ్రీ గద్దె తేజస్విని 10 జిపితో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణురాలు కావడంతో కోరుట్ల ఎంపీపీ తోట నారాయణ ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలలు బీఆర్ఎస్ ప్రభుత్వ



హయాంలో అభివృద్ధి చెందుతున్నాయని అనడానికి నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమ్మాయి, ఉప సర్పంచ్, వారి తల్లిదండ్రులు, నాయకులు శ్రీనివాసరావు, గంగారాం, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



భీమదేవరపల్లి మండలం ముత్తారం తికూటేశ్వర ఆలయ అర్చకులు మాణిక్యాపూర్ వాస్తవ్యులు హరీష్ చారి వివాహం సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించిన శ్రీశ్రీశ్రీ రాజయోగి సిద్దేస్వర మహారాజ్ స్వామివారు. కొత్తపల్లి శ్రీ దత్త సాయి క్షేత్రం ఆలయ అర్చకులు కోటేశ్వర చారి, చక్రాచారి తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ముఖ్యమంత్రి ఛాంపియన్షిప్ ట్రోఫీ

### 15వ తేదీ నుండి 24 వరకు క్రీడా పోటీలు

### పకడ్బందీ ఏర్పాట్లకు కలెక్టర్ ఆదేశం

**జనగామ మే 16 (ప్రజామంటలు):** జిల్లా స్థాయి ముఖ్యమంత్రి ఛాంపియన్షిప్ ట్రోఫీ క్రీడా పోటీలకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్లో డీసీపీ సీతారాం, ఛాంపియన్షిప్ ట్రోఫీ కమిటీ సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ శివలింగయ్య మాట్లాడుతూ... ఈనెల 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు జిల్లాలో ముఖ్యమంత్రి ఛాంపియన్షిప్ ట్రోఫీ క్రీడా పోటీలను నిర్వహిస్తామని, అందులో భాగంగానే ప్రస్తుతం మండలాల్లో రేపటి వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని, ఈ జిల్లాస్థాయి క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయిలో ఈనెల 28 నుండి 31వ తేదీ వరకు జరిగే క్రీడా పోటీలకు పంపిస్తాని అన్నారు. ఈ నెల 22 నుండి 24 వరకు మూడు రోజులు జనగామ పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ముఖ్యమంత్రి ఛాంపియన్షిప్



జిల్లా స్థాయి ట్రోఫీ క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన అన్నారు.

ఈ క్రీడా పోటీల్లో పాల్గొని క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల సిబ్బందిని ఆయన ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ అధికారి గోపాల్ రావు, ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఇన్చార్జి ఆర్డీవో ఏకే మన్సూరి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్

### సకాలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు

### నకిలీ విత్తనాల విక్రయాలపై ఉక్కుపాదం మోపి అరికట్టాలి

జనగామ మే 16 (ప్రజామంటలు): జిల్లాలో ముందస్తు ప్రణాళికతో రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య, అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుండి రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖామాత్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డి.జి.పి. అంజనీ కుమార్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, పోలీస్ శాఖ ఉన్నత అధికారులతో కలిసి వానాకాలం సీజన్ ముందస్తు ఏర్పాట్లపై వ్యవసాయ అధికారులు, టాస్క్ ఫోర్స్ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించగా, సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సిహెచ్. శివలింగయ్య, డి.సి.పి. సీతారాం తో కలిసి పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించి రైతులకు, కోట్లాది మందికి ఉపాధి కల్పించడం జరుగుతున్నదని, గడిచిన 9 ఏళ్లలో వ్యవసాయ రంగానికి దాదాపు 4.5 లక్షల కోట్లు కేటాయించడం జరిగిందని, దేశంలో మన కంటే రెండు, మూడు రెట్లు పెద్ద రాష్ట్రాల్లో సైతం ఇంత భారీగా ఖర్చు చేయలేదని అన్నారు. తెలంగాణలో ప్రభుత్వం తీసుకున్న రైతు అనుకూల విధానాల కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయని, రైతులకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సమయానికి అందించడంతో పాటు పంట దిగుబడి అధికంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు. వానాకాలం సీజన్ కు సంబంధించి రైతులకు అవసరమైన మేరకు విత్తనాలు, ఎరువులను స్టాక్ ఉంచుకోవాలని, ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన వైఖరి కారణంగా ప్రస్తుత కాలంలో నకిలీ విత్తనాలు మార్కెట్ లో దాదాపు మాయమయ్యాయి అని, అక్కడక్కడ ఉన్న కొన్ని నకిలీలను పూర్తిగా అరికట్టాలని, అమాయకులకు ఇబ్బంది కలిగించరాదని, క్షేత్ర స్థాయిలో సమాచారం సేకరించి పక్క రాష్ట్రాల నుండి వచ్చే నకిలీ విత్తనాలు, ఎరువులపై దృష్టి పెట్టి పకడ్బందీగా నియంత్రించాలని అన్నారు. దేశంలో ఉన్న విత్తన అవసరాలలో దాదాపు 60% మేర తెలంగాణ నుంచి సరఫరా చేస్తున్నామని, దేశానికి విత్తన బాండాగారంగా తెలంగాణ ఆవిర్భవించిందని తెలిపారు. తెలంగాణలో ఉన్న విత్తన ఉత్పత్తి పరిశ్రమకు ఇబ్బంది కలగకుండా, నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలని, నకిలీ విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి నిఘా



పెంచాలని మంత్రి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య,అధికారులతో మాట్లాడుతూ, నకిలి విత్తనాలు అరికట్టడానికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. పత్తి నకిలీ విత్తనాలను బట్ట సంచులలో తీసుకొని వస్తున్నారని, హెచ్.టి. కాటన్ పట్ల చట్టబద్ధమైన ఆమోదం లేదని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, తనిఖీ సమయంలో టెస్ట్ కిట్స్ వెంట ఉంచుకోవాలని, రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించేలా చూడాలని తెలిపారు. జిల్లాలో మూడు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని అందులో వ్యవసాయ, పోలీస్ సంబంధిత సిబ్బంది ఉంటారన్నారు.

మన రాష్ట్రంలో వ్యవసాయ శాఖ మంత్రి గారి సూచనల ప్రకారం వచ్చే వానాకాలం వివిధ పంటలు కింద అవసరాల కోసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో ఉన్న టాస్క్ ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అనుమానిత ప్రదేశాలలో వెంటనే శాంపిల్స్ చెక్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విత్తన డీలర్లు దుకాణాల్లో తప్పనిసరిగా లైసెన్స్ ప్రదర్శించాలని, విత్తనాల విక్రయ బిల్లు పూర్తి వివరాలతో అందించాలని, స్టాక్ రిజిస్టర్ నిర్వహణ, ఫారం డీ సమర్పణ, లైసెన్స్ రెన్యువల్ చేయడం, షాపు మార్పు వివరాలు లైసెన్స్ లో నమోదు వంటి అంశాల పై అధికారులు విత్తన డీలర్లకు, వ్యాపారస్థులకు సమాచారం అందించి సవరించేలా చూడాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

జిల్లాలో ఆకస్మిక తనిఖీల సమయంలో గడువు తేది ముగిసిన విత్తనాలు అమ్మడం, లైసెన్స్ లేకుండా విక్రయాలు చేపట్టడం, హెచ్.టీ పత్తి విత్తనాల అమ్మకం, లైసెన్స్ ఇతరులకు అందించి విక్రయాలు చేపట్టడం, నకిలీ విత్తనాలు ఉండటం వంటి అంశాల పట్ల కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసు కుంటూ నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ఏసీపి దేవేందర్ రెడ్డి, అసిస్టెంట్ డివిజనల్, మండల వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ప్రజా చైతన్య యాత్ర ముగింపు బహిరంగ సభ విజయవంతం

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్

**హుస్నాబాద్ 16 మే (ప్రజామంటలు):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 14న ప్రారంభమైన పల్లెకు సిపిఐ గడప గడపకు సిపిఐ పేరుతొ సిద్దిపేట, సిరిసిల్ల, కరీంగర్, జగిత్యాల, పెద్దపెల్లి హనుమకొండ జిల్లాల్లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి నాయకత్వంలో ఏప్రిల్ 16 న కరీంనగర్ జిల్లా సిపిఐ ప్రథమ కార్యదర్శి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్ రావు విగ్రహం నుంచి మొదలై బస్సు యాత్ర ఈ నెల 15 సోమవారం హుస్నాబాద్ లొ జరిగిన ముగింపు సిపిఐ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కంకనాల నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హుస్నాబాద్ నియోజకవర్గం ఇంచార్జి తక్కల్లపెల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కళవేని శంకర్, కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, హన్మకొండ జిల్లాల సిపిఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద



పవన్, గుంటి వేణు, వెన్న సురేష్, తాండ్ర సదానందం, కర్రె బిక్షపతి, సిని గేయ రచయిత ప్రజా గాయకులు మిట్టపెల్లి సురేందర్, అమ్మ పాట రాంబాబు, తెలంగాణ ప్రజా నాట్య మండలి కళాకారులు నాయకులు పల్లే నర్సింహ్మా,కన్నం లక్ష్మి నారాయణ, సభకు స్వచ్చందంగా వచ్చి సభను విజయవంతం చేసిన హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి, హుస్నాబాద్, అక్కన్నపెట, కొహెడ,సైదపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వేలేరు మండలాలకు చెందిన సిపిఐ మండల కార్యదర్శులకు, జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులకు, ప్రజా సంఘాల నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు, సిపిఐ సానుభూతి పరులకు, శ్రేయోభిలాషులకు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ హుస్నాబాద్ మండల సమితి పక్షణ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్ విప్లవ జేజేలు తెలిపారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి,సింగిరెడ్డి అమరుల భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అక్కన్నపెట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు బైరగొని సరోజన, సిపిఐ హుస్నాబాద్ మండల నాయకులు పొదిల కుమారస్వామి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు కాల్వల ఎల్లయ్య పాల్గొన్నారు.

# అన్యాక్రాంత భూములపై ఆర్డీవోకు వినతిపత్రం

**కోరుట్ల టౌన్ మే 17 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ మరియు గ్రామ కంఠం స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని కోరుట్ల డెవలప్ మెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఆర్డీవో కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫోరమ్ కన్వీనర్, చెన్న విశ్వనాథం, మాట్లాడుతూ.... పట్టణంలోని ప్రభుత్వ భూములను స్థానికంగా నివసిస్తున్న వారికి వారి ఆదాయం, రేషన్ మరియు ఆధార్ ప్రకారం అర్హులైన వారికి ఇవ్వకుండా ఇతర ప్రాంతాల వారికి కుల సంఘాలకు, ధనవంతులకు ఇవ్వడం సరికాదని సర్వే నం 1300 లో దాదాపు 30 మందికి పైగా మెట్టుపల్లి లోని కొంత మంది విలేఖరులకు భూములు ఇవ్వడం పద్దతి కాదని డబుల్ బెడ్ రూములు కుదించి వారికి కేటాయించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని వాటిని వెంటనే రద్దు చేసి ఇంటి నెంబర్లు కూడా ఇవ్వవద్దని పేర్కొన్నారు. తర్వాత కో కన్వీనర్ పేట భాస్కర్ మాట్లాడుతూ పట్టణంలో గత కొన్ని రోజులుగా సర్వే నం 923 జంబి గద్దె వద్ద నిరుపేదలు భూమి కోసం గుడిసెలు వేసుకొని తమ హక్కుల కోసం పోరాడితే గుడిసెలు తొలగించారని మెట్టుపల్లి లో స్థలాలు లేకపోతే ప్రభుత్వం స్థలాలు కొని కట్టివ్వాలని కానీ పక్కన ఉన్న పట్టణంలోని హక్కులను హరించరాదనీ అదేవిధంగా బాబు జగజీవన్ రామ్ పార్క్ ను, వాగు ను ఇసుక మాఫియా రోజురోజుకు అక్రమ రవాణా చేస్తూ గుంతలుగా చేస్తున్నారని దుయ్యబట్టారు. అలాగే పట్టణానికి తల మాణికమైన గడి



బురుజులు, గ్రామ కంఠం స్థలాల విషయంలో కూడా చర్యలు తీసుకొని ఆ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని ఫోరమ్ పక్షాన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వి6 రిపోర్టర్ అల్లే రాము మరియు కోరుట్ల డెవలప్ మెంట్ ఫోరమ్ సభ్యులు పాల్గొన్నారు.

### ఆత్మబలం తోడైతే!...




ఆత్మబలం తోడైతే!
ఆకాశం తలవంచును
గట్టిగా పోరాడితే!
మట్టి కూడా జైకొట్టును

వాయిదా వేసేస్తే
ఫాయిదా ఏమున్నది?
తక్షణమే చేసేస్తే
పనికి ఫలితమున్నది

అభియోగాలు మానితే!
సయోధ్య సొంతమగును

అపనిందలు వీడితే!
ఆత్మీయత పుష్పించును

చేయి చేయి కలిస్తే!
సమైక్యత ఉదయించును
మనసు మనసు కలిస్తే!
మమకారం జనించును



రచన: గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు



## మూడో విడత ఇందిరమ్మ ఇండ్ల చాకలి ఐలమ్మ నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని ధర్నా

**జనగామ మే 16 (ప్రజామంటలు):** జనగామ పట్టణంలో గత 8 ఏళ్ల కింద ఇల్లు లేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పట్టాలు ఇచ్చింది. అక్కడ చిన్నచిన్న ఇల్లు నిర్మించుకొని ప్రజలు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. మూడో విడత ఇందిరమ్మ ఇండ్ల వీరనారి ఐలమ్మనగర్ లో మౌలిక వసతులు కల్పించాలని



జనగామ మున్సిపాలిటీ కార్యాలయం ముందు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్ష వహించగా మోకు కనకా రెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శి పాల్గొని మాట్లాడారు. జనగామ మున్సిపాలిటీ చైర్మన్, కమిషనర్ కి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎర్ర అహల్య జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి చెంచు విజేందర్ పోతుకునూరి ఉపేందర్ పోరాట కమిటీ అధ్యక్షులు కళ్యాణం లింగం పట్టణ కమిటీ సభ్యులు పందిళ్ళ కళ్యాణి పల్లె లలిత శాఖ కార్యదర్శిలు బూడిది అంజమ్మ, చీర రజిత, రమావత్, మిత్యా నాయక్, ఎండి గౌసియా, దామెర అబ్రహం లింకన్, కుమ్మగాని రాజు, ఎర్ర రజిత వెంకటేష్, జయ, శాంత, వినోద్, కళ్యాణ్ పాల్గొన్నారు.

## ఈనెల 30లోగా ఇండ్ల రెగ్యులరైజ్ దరఖాస్తు చేసుకోండి

**సికింద్రాబాద్ మే 16 (ప్రజామంటలు):** పేదల ఇండ్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెం. 58, 59 ల ప్రకారం అర్హులైన



వారు ఈనెల 30 లోగా తమ ఇండ్ల రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సికింద్రాబాద్ తహసీల్దార్ శైలజ కోరారు. మంగళవారం బన్సీలాల్ పేట డివిజన్ కీస్ బ్లాక్ సొసైటీ కమ్యూనిటీ హాల్ లో జరిగిన ఇండ్ల రెగ్యులరైజ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఇండ్లను ఇప్పటివరకు క్రమబద్ధీకరించు కోని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహశీల్దార్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీ.ఆర్.ఎస్ ప్రెసిడెంట్ ఎల్. వెంకటేశన్ రాజు, రాజేందర్, ముక్క శ్రీనివాస్, లంబు శ్రీను, వెంకటేశ్, లక్ష్మీ, ఆర్.ఐ. శ్రీనివాస్, స్థానిక బస్తీ వాసులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, షాది మూభారక్ చెక్కుల పంపిణీ

**జగిత్యాల మే 16 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ మరియు అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 76 మంది లబ్దిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 53 లక్షల 36 వేల రూపాయల విలువగల చెక్కులను, 8 మంది





ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి, షాది మూభారక్ పథకం ద్వారా మంజూరైన 8 లక్షల రూపాయల చేక్కులను జగిత్యాల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం మోతే రోడ్డులో అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. మున్సిపల్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్, జెడ్పీటీసీ మహేష్, కౌన్సిలర్ లు, సర్పంచులు, ఎంపీటీసీ లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

### ఖాళీ బూడిదవుతున్న పంట పొలాలు
### ఆస్తి నష్టమే కాకుండా ప్రాణనష్టం జరిగే అవకాశం

**ఎల్కతుర్తి, మే 16 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ తీగలు లూజుగా ఉండి గాలి వచ్చినప్పుడు ఒకదానికొకటి తాకి రాపిడి వలన వీర నారాయణపూర్ గ్రామ నివాసి మంద వీరస్వామి ఎకరం పొలం కాలిపోవడంతో పాటు దగ్గు తిరుపతి రావు, పుల్లూరి రవీంద్రా రావు లకు చెందిన కొంత మేర వరి పొలం అక్కడే పోసుకున్న రైతుల వరికుప్పలు కూడా కాలిపోయాయి.



ఆస్తి నష్టం అంచనా విలువ సుమారుగా రెండు లక్షల వరకు నష్టం వాటిల్లింది తెలిపారు వెంటనే విద్యుత్ అధికారులు చొరవ తీసుకొని విద్యుత్ వైర్లను సరిచేయాలని ఆస్తి నష్టం తోపాటు ప్రాణ నష్టం జరిగే అవకాశాలు మెండుగా ఉన్నందున అధికారులు మేల్కొని ఆస్తి నష్టం పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఈరోజు జరిగిన ఆస్తి నష్టం వెంటనే చెల్లించాలని రైతుల డిమాండ్ చేశారు.

# తాళాలు తీయకుండా దర్శనమిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు

### రైతుల సమస్యలపై స్పందించని అధికారులు

**ఎల్కతుర్తి మే 16 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని రైతు వేదిక వద్ద వివిధ గ్రామాల రైతులు వారి సమస్యల పరిష్కారం కోసం వస్తే ఉదయం 10 గంటల నుండి ఇప్పటి వరకు సమయం 12 గంటల వరకు తాళాలు తియ్యకుండా ఒక్క అధికారి రాకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్న మండల అగ్రికల్చర్ ఆఫీసర్ సిబ్బంది, అంతే కాకుండా విద్యుత్ అధికారి ఆఫీస్ కి రాకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్న వైనం. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ మండల్ అధ్యక్షులు ఆరెపల్లి సారయ్య మాట్లాడుతూ.... మే 14 న వీర నారాయణపూర్ గ్రామ శివారులో విద్యుత్ వైర్లు ఒకదానికి ఒకటి అంటుకొని మంటలు చెలరేగి దాదాపు రెండు లక్షల పంట నష్టం జరిగిన రైతులు మంద వీరస్వామి, దగ్గు మాధవరావు, దగ్గు తిరుపతిరావు, దగ్గు కమలాకర్ రావు లో వ్యవసాయ అధికారులను కలవడానికి వచ్చిన సందర్భంలో అధికారులు అందులో అందుబాటులో లేకపోవడం విద్యుత్ అధికారులను కలవడానికి వెళ్లిన రైతులకు అదే పరిస్థితి ఎదురవడం వలన రైతులు ఆవేదన చెందారని అన్నారు.

విద్యుత్ శాఖ అధికారులు ఎల్కతుర్తి మండల పరిధిలోని కరెంటు వైర్ల విషయంలో ఆస్తి నష్టమే కాకుండా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉన్నందున అధికారులు వెంటనే విద్యుత్ వైర్లను సరి చేయాలన్నారు. మండలంలో పరిపాలన ఉందా లేదా ప్రజలకు అర్థం కావడం లేదని తహసిల్దార్ కార్యాలయంలో ఇదే తంతు కొనసాగుతుందని మండుటెండల్లో రైతులు అవస్థలు పడుతున్నారని దయచేసి మండల ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలపై స్పందించి సకాలంలో అధికారులు వారి వారి కార్యాలయాలకు సమయపాలన పాటించే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మంద వీరస్వామి, దగ్గు మాధవరావు, దగ్గు తిరుపతిరావు, దగ్గు కమలాకర్ రావు, ఎర్ర ప్రకాష్ దాట్ల బిక్షపతి పాల్గొన్నారు.



# అన్నదాతను ఆగం చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం

- ఓ నిందితుడిపై ముల్కనూర్, ఎల్కతుర్తి, వంగర పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు
- చర్లపల్లి జైలుకు తరలింపు
- వ్యాపారస్తులు సకాలంలో రైతులకు డబ్బులు చెల్లించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వి. రంగనాథ్

**భీమదేవరపల్లి మే 16 (ప్రజామంటలు):** దేశానికి వెన్నుముక అయిన అన్నదాతను ఆగం చేస్తే, మోసానికి గురి చేసే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వి. రంగనాథ్ హెచ్చరించారు. భీమదేవరపల్లి మండలానికి చెందిన అన్నదాతలను కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన రావిశెట్టి రవిబాబు (వరంగల్), ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతన్నల నుండి ధాన్యం కొనుగోలు చేసి, వారికి ఇవ్వాల్సిన డబ్బులను ఎగవేతకు పాల్పడినందుకు గాను నిందితుడిపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ కమిషనర్ రంగనాథ్ తొలిసారిగా పీడీ యాక్ట్ ఉత్తర్వులను జారీచేశారు. పోలీస్ కమిషనర్ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ నిందితుడికి సోమవారం



కాజీపేట ఏసీపీ కార్యాలయంలో అందజేసి చర్లపల్లి జైలుకి తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ వివరాలను వెల్లడిస్తూ, నిందితుడు వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో వ్యవసాయదారుల నుండి సుమారు 6 టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు చెల్లించాల్సి సుమారు కోటిన్నర పైగా ధాన్యం డబ్బులు చెల్లించకుండా డబ్బు ఎగవేతకు పాల్పడటంతో, వ్యవసాయదారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎల్కతుర్తి, ముల్కనూరు, వంగర పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై కేసులు నమోదు కావడంతో పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయదారుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం కు వ్యాపారస్తులు సకాలంలో చెల్లింపులు చేయాలని, అలా కాకుండా డబ్బులు ఎగవేత ధోరణికి పాల్పడితే సహించేది లేదని అన్నారు. దేశాభివృద్ధిలో కీలకంగా నిలిచే రైతన్నకు బాసటగా నిలువాల్సిన బాధ్యత మనందరిపై వుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ మహేందర్ పాల్గొన్నారు.

# మత్స్యకారులకు టిడిపి అరకొర సాయం

### తాముసంవత్సరంలోనే రూ.231 కోట్లు ఇస్తున్నాం
### 1,23,519 మత్స్యకారుల ఖాతాల్లో రూ.231 కోట్లు జమ
### టీడీపీ ప్రభుత్వానికి, వైసీపీ ప్రభుత్వానికి తేడా గమించాలి
### ఎన్నికలొస్తేనే బాబుకు ప్రజలు గుర్తుకు వస్తారు
### లేకుంటే హైదరాబాద్‌లో పడకేస్తారు
### మత్స్యకార భరోసా నిధుల విడుదలలో సిఎం జగన్

**బాపట్ల,మే16(ప్రజామంటలు):** తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు అరకొర సాయం మాత్రమే అందిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. టీడీపీ హయాంలో రూ. 4 వేల మాత్రమే ఇచ్చారని, అది కూడా కొందరికి మాత్రమే అందేదని అన్నారు. బాపట్ల జిల్లా నిజాంపట్నం వేదికగా ఐదో విడత వైఎస్సార్ మత్స్యకార భరోసా నిధులను సిఎం వైఎస్.జగన్ మంగళవారం విడుదల చేశారు. దీనికి ముందుగా వైఎస్సార్ మత్స్యాకార భరోసా నిధుల విడుదల కార్యక్రమం సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సిఎం జగన్ పరిశీలించారు. సభా వేదికపై కంప్యూటర్‌లో బటన్ నొక్కి 1,23,519 మత్స్యకార కుటుంబాల ఖాతాల్లో రూ.231 కోట్లు జమ చేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మొహన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ఐదేళ్లలో కేవలం రూ.104 కోట్లు మాత్రమే ఇచ్చారని,





వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క సంవత్సరంలోనే రూ.231 కోట్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వానికి, వైసీపీ ప్రభుత్వానికి తేడా గమనించాలని సూచించారు. టీడీపీ పాలనలో 1100 బోట్లకు మాత్రమే రాయితీ ఇస్తే.. ఇప్పుడు 20 వేల బోట్లకు సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో డీజిల్ పై రూ.6 మాత్రమే రాయితీ ఇచ్చారని, వైసీపీ ప్రభుత్వ పాలనలో డీజిల్ పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పాలనను చూసి గత పాలకులు తట్టుకోలేకపోతున్నారని చెప్పుకొచ్చారు. పేద వారికి సాయం చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికలు వస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబుకు బీసీ, ఎస్సీ, మైనారిటీలు గుర్తుకు వస్తారని ఎద్దేవా చేశారు. తాను మంచిని నమ్ముకున్నానని, ప్రజలను నమ్ముకున్నానని సీఎం జగన్ వ్యాఖ్యానించారు. ప్రతి అడుగులోనూ మంచి చేస్తున్నామని వెల్లడించారు. చంద్రబాబు అధికారంలో ఉంటే అమరావతిలో.. అధికారం లేకపోతే జూబ్లీహిల్స్‌లో ఉంటారని సీఎం జగన్ విమర్శించారు. ఏపీలో దోచుకుని హైదరాబాద్ లో ఉండటం వీరి పని అంటూ ఆరోపించారు. ఏపీలోనే తన శాశ్వత నివాసం ఉందని, తాడేపల్లిలో ఇల్లు కట్టుకుని ఉంటున్నట్లు చెప్పుకొచ్చారు జగన్. ప్రధానులను, రాష్ట్రపతులను చేశానని చెప్పుకునే పెద్ద మనిషికి.. ఒంటరిగా ఎన్నికల బరిలోకి దిగే దమ్ముందా అంటూ జగన్ సవాల్ విసిరారు. రాష్ట్రంలోని 175 స్థానాల్లో పోటీ చేసే సత్తా చంద్రబాబు నాయుడుకు లేదని, ఆయనకు సభలు పెట్టే ధైర్యం కూడా లేదని విమర్శించారు. చంద్రబాబు, ఆయన పార్టీ వెంటిలేటర్ పై ఉందని ఎద్దేవా చేశారు. అలాంటి వాళ్ల ప్రజలకు మంచి చేయగలరా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. బాబు, న దత్తపుత్రుడు నమ్ముకున్నది పొత్తులను, కుయుక్తులనేనని జగన్ ఎద్దేవా చేశారు. చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకం కూడా గుర్తు రాదని, ఆయన పేరు తీస్తే గుర్తుకు వచ్చేది వెన్నుపోటే అని విమర్శలు గుప్పించారు. ఎన్ని వ్యవస్థనలు తనపై ప్రయోగించినా 15 ఏళ్లుగా ఎక్కడా రాజీపడకుండా, ప్రజల తరపున నిలబడి మంచి చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు సీఎం. మీకు మంచి జరిగితే మీ బిడ్డకు తోడుగా నిలవండంటూ ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రిని కలిస్తే చాలు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, బీజేపీ, కాంగ్రెస్ తో అంటకాగిన వాళ్ల తనను విమర్శలు చేస్తున్నారని సీఎం జగన్ మండిపడ్డారు. పొత్తులు పెట్టుకుని, తెగదెంపులు చేసుకునేది వీళ్లేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాహాలు చేసుకునేది వీళ్లే.. విడాకులు తీసుకునేది వీళ్లేనని ఎద్దేవా చేశారు.గతంలో డీజిల్‌పై రూ.6 ఇస్తే.. ఇప్పుడు రూ.9 సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడా గమనించాలన్నారు. గత ప్రభుత్వంలో మత్స్యకారులకు అరకొర సాయం మాత్రమే అందిందని.. టిడిపి ప్రభుత్వంలో రూ. 4వేలు.. అది కూడా కేవలం కొందరికి మాత్రమే అందేదని చెప్పారు. ఏపీలో దోచుకొని ఆ తరువాత హైదరాబాద్‌లో ఉండటం వారి పని అని దుయ్యబట్టారు. తనకు మాత్రం ఎపిలోనే శాశ్వత నివాసం ఉందని, తాడేపల్లిలో ఇళ్లు కట్టుకొని ఉంటున్నానని అన్నారు. ప్రధానులు, రాష్ట్రపతులను చేశానన్న పెద్ద మనిషి.. ఒంటరిగా బరిలోకి దిగే దమ్ముందా ? అని ప్రశ్నించారు. 175 స్థానాల్లో పోటీ చేసే సత్తా చంద్రబాబుకు లేదనీ, ఆయనకు సభలు పెట్టే ధైర్యం కూడా లేదని ధ్వజమెత్తారు. చంద్రబాబు, ఆయన పార్టీ వెంటిలేటర్‌పై ఉందని ఎద్దేవా చేశారు. అలాంటి వాళ్ల ప్రజలకు మంచి చేయగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు, తన దత్తపుత్రుడు నమ్ముకున్నది పొత్తులు, కుయుక్తులనే నన్నారు. చంద్రబాబు పేరు చెబితే ఒక్కపథకం గుర్తు రాదనీ, ఆయన పేరు తలిస్తే గుర్తుకొచ్చేది వెన్నుపోటేనని సిఎం జగన్ ఘాటు విమర్శలు చేశారు. ఎన్ని వ్యవస్థలను తనపై ప్రయోగించినా 15 ఏళ్లుగా ఎక్కడా రాజీపడలేదని, ప్రజల తరపున నిలబడి మంచి చేస్తున్నానని అన్నారు. ' మీకు మంచి జరిగితే మీ బిడ్డకు తోడుగా నిలవండి ' అని కోరారు. ప్రధానిని కలిస్తే చాలు తనపై దుష్ప్రచారం చేస్తారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్‌తో అంటకాగిన వాళుతనను విమర్శిస్తున్నారని, పొత్తులు పెట్టుకొని.. తెగదెంపులు చేసుకునేది వీళ్లేనని.. వివాహాలు చేసునేది వీళ్లే.. విడాకులు తీసుకునేది వీళ్లేనని ముఖ్యమంత్రి జగన్ దుమ్మెత్తిపోశారు.

## టిడిపి అధికారంలోకి వస్తే ఏడాదిలోగా ఆర్డీఎస్

### మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్యప్రకాశ్ హామీ

**కర్నూలు,మే16(ప్రజామంటలు):** తాము అధికారంలోకి వస్తే ఏడాదిలోపే వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి చెప్పారు. ప్రతి గ్రామానికి సాగు, తాగునీరు అందించడంతో పాటు ఆలూరులో టమోటా ఫాక్టరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గడప గడప వైసీపీ కార్యక్రమంలో పాల్గొనే ధైర్యం ఆ పార్టీ ఎమ్మెల్యేలకు లేదన్నారు. పోలీసుల సాయం తీసుకుని వెళ్లడం దురదృష్టకరమన్నారు. అధికారంలోకి వచ్చేందుకు జగన్ అపుడు ముద్దులు పెడితే ఇపుడు గుద్దులు పెడుతున్నాడని విమర్శించారు. వైసీపీని నమ్మి మోసపోవద్దని కోట్ల సూర్య ప్రజలను కోరారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా వైసీపీ ప్రభుత్వం మారుస్తోందని అన్నారు. పాదయాత్రలో అమలు చేయలేని హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయడంలో తిప్పలు పడుతున్నారన్నారు. సంక్షేమ పథకాలను తుంగలో తొక్కారని ఆరోపించారు. మడమ తిప్పను అంటూ చెప్పిన సీఎం జగన్ ఇప్పుడు మాట తప్పి, మడమ తిప్పారన్నారు. నవరత్నాలు హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.

ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
కరీంనగర్ జిల్లాలోని
అన్ని మండలాలలో...
విలేకరులు కావలెను
అభిరుచి, అనుభవం, ఆసక్తి గలవారు సంప్రదించండి:
93915 33339, 93484 22113, 8106 1947 33



# కలెక్షన్లలో దూసుకుపోతున్న ద కేరళ స్టోరీ

వివాదాలను సృష్టించినా..విడుదలను అడ్డుకున్నా..మంచి చిత్రాలకు ఢోకా లేదని..ఈ మధ్య విడుదలై విజయం సాధించిన చిత్రం 'ది కేరళ స్టోరీ' నిరూపించింది. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో, రాజకీయ పార్టీల్లో చర్చనీయాంశమైంది. కేరళ ప్రభుత్వంతో పాటు ప్రజలు ఈ చిత్రం విడుదల నిలిపేయాలంటూ డిమాండ్ చేశారు. కొన్ని ప్రభుత్వాలు నిషేదం విధించాయి. కొన్ని రాష్ట్రాల్లో అయితే పన్ను రాయితీ కల్పించారు. ఇన్ని వివాదాల నడుమ ఈ చిత్రం ఈ నెల 5న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఒక వర్గం ప్రేక్షకులు, ప్రభుత్వాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్త మవుతున్నా ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద మంచి భారీ వసూళ్లు సాధిస్తోంది. విడుదలైన తక్కువ రోజుల్లో దాదాపు 80 కోట్లు వసూళ్లు రాబట్టింది. త్వరలోనే వంద కోట్ల క్లబ్‌లో చేరే దిశగా ఈ చిత్రం పరుగులు తీస్తోంది. ఈ నెల 12 నుంచి 37 దేశాల్లో ఈ చిత్రం విడుదల కానుందని నటి అదాశర్మ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తాజాగా దర్శకుడు సుదీప్తో సేన్ మరో అప్‌డేట్ ఇచ్చారు. ఇండియాలో ఈ చిత్రాన్ని 60 లక్షలకు పైగా ప్రేక్షకులు వీక్షించారు. ఇంకా ఆదరిస్తూనే ఉన్నారు. ఇప్పుడు కొత్త చాప్టర్ ప్రారంభం కాబోతుంది. 'ది కేరళ స్టోరీ' చిత్రం ఇప్పుడు 40కి పైగా దేశాల్లో విడుదల కానుంది. ఈ సంఖ్య పెరగొచ్చు కూడా. ప్రేక్షకులు చూపించే ఆదరణ, ప్రేమాభి మానాలే దీనికి కారణం. ఇప్పుడు మా బాధ్యత మరింత పెరిగింది' అని సుదీప్తోసేన్ ట్వీట్ చేశారు. ఈ చిత్రంలో ఉన్నికృష్ణన్ పాత్రను పోషించడం బలమైన ముద్ర వేసిందని నటి అదాశర్మ తెలిపారు. ఈ పాత్ర నా గుండెలోతుల్లోకి చొచ్చుకెళ్లింది అని పేర్కొన్నారు. తనపై ప్రేక్షకులు కురిపిస్తోన్న ప్రేమ అపూర్వ మైందని చెప్పారు. అదాశర్మ, సిద్ధి ఇద్నానీ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సుదీప్తో సన్ తెరకెక్కించారు.

# అధర్వ నుంచి రింగరింగా రోజా..ప్రోమో



కార్తీక్ రాజు టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'అధర్వ' క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తున్న ఈ చిత్రాన్ని మహేష్‌రెడ్డి డైరెక్ట్ చేస్తున్నాడు. సిమ్రన్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే రవితేజ లాంఛ్ చేసిన టైటిల్ లోగో, మోషన్‌పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు మేకర్స్. రింగా రింగా రోజే అంటూ సాగే సాంగ్ ప్రోమోను లాంఛ్ చేశారు మేకర్స్. హీరోయిన్‌ను ఫాలో అవుతూ హీరో పాడుకుంటున్న పాట మ్యూజిక్ లవర్స్ ను ఇంప్రెస్ చేసేలా ఉండబోతున్నట్టు ప్రోమోతో తెలిసిపోతుంది. కిట్టు విస్సా ప్రగడ రాసిన ఈ పాటను జావెద్ అలీ పాడాడు. రాజ్ కృష్ణ కొరియోగ్రఫీ చేశాడు. శ్రీచరణ్ పాకాల బ్యూటీఫుల్ ట్యూన్స్ రెడీ చేసినట్టు తాజా ప్రోమో చెబుతోంది. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు వచ్చిన క్రైమ్ థ్రిల్లర్ సినిమాలతో పోల్చితే డిఫరెంట్ ఫీల్ అందించేలా.. ఉత్కంఠ రేకెత్తించే స్టోరీ, స్క్రీన్‌ప్లే, సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు ఇప్పటికే దర్శకుడు హింట్ ఇచ్చేశాడు.



## లైగర్ మూవీతో భారీగా నష్టపోయాం

లైగర్ సినిమా విషయంలో తమకు జరిగిన నష్టానికి తగిన న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ ఎగ్జిబిటర్స్ అండ్ లీజర్స్ అసోసియేషన్ ఫిలిం ఛాంబర్ ముందు శుక్రవారం నిరవధిక దీక్షకు దిగింది. ఈ విషయంలో తమకు న్యాయం జరిగే వరకు దీక్ష కొనసాగుతుందని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అండ్ లీజర్స్ అసోసియేషన్ తెలిపింది. సినిమాపై ఉన్న హైప్ కారణంగా అధిక ధరకు కొన్నామని, తీరా చూస్తే మూవీ డిజాస్టర్ కావడంతో తాము పెట్టిన ఖర్చులో సగం కూడా రాలేదని, ఎలాగైనా తమను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే.. ఈ దీక్షపై లైగర్ మూవీ నిర్మాత, దర్శకుడు పూరి జగన్నాథ్ ఇప్పటివరకు స్పందించలేదు. ఇక లైగర్ మూవీ 2022లో ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ డిజాస్టర్ గా నిలిచింది. విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన ఈ సినిమా 200 కోట్ల బ్జడెట్ తో పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కింది. కానీ రిలీజ్ తరువాత ఈ సినిమాకి మినిమమ్ కలెక్షన్స్ కూడా రాలేదు. దీంతో చాలా చోట్ల ఎగ్జిబిటర్స్ నష్టపోయారు. అయితే లైగర్ రిలీజ్ సమయంలోనే ఈ విషయంలో కొంత వివాదం జరిగింది. దానికి పూరి జగన్నాథ్ కూడా సానుకూలంగానే స్పందించారు. అది అక్కడితో ముగిసిపోయింది అనుకున్నారు అంతా.

కానీ తాజా పరిణామంతో.. ఆ సమస్య ఇంకా ఓ కొలిక్కి రాలేదని అర్థమయింది. మరి ఈ ఇష్యూపై ఫిలిం ఛాంబర్ కానీ, పూరి జగన్నాథ్ కానీ ఎలా స్పందిస్తారో చూడాలి.

# త్వరలో టైగర్ నాగేశ్వరరావు మూవీ ఫస్ట్ లుక్

మాస్ మహారాజా రవితేజ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్. టైగర్ నాగేశ్వర రావు మూవీ నుండి అదిరిపోయే



అప్డేట్ ఇచ్చారు మేకర్స్. వంశీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ దసరా కానుకగా అక్టోబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే తాజాగా ఈ సినిమా నుండి రవితేజ ఫస్ట్ లుక్ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఈమేరకు అఫీషియల్ అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. 'మాస్ మహారాజా సంభవం లోడింగ్.. టైగర్ నాగేశ్వర రావు ఫస్ట్ లుక్, రవితేజ ఫ్యాన్స్ గర్వపడేలా ఉంటుంది. అతి త్వరలో ఫస్ట్ లుక్‌ను కూడా రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేశారు. దీంతో.. రవితేజ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇదిలా ఉంటే.. రిజల్ట్‌తో సబంధం లేకుండా వరుస సినిమాలతో దూసుకు పోతున్నాడు రవితేజ. ఈ క్రమంలో పారితోషికం కూడా డబల్ చేశాడని సమాచారం. రవితేజ టైగర్ నాగేశ్వర రావు తర్వాత 'ఈగల్' మూవీ చేస్తున్నాడు. కలర్ ఫొటో డైరెక్టర్ సందీప్ రాజ్ తో కూడా ఒక సినిమా ఎలాన్ చేస్తున్నాడు. ఈ రెండు సినిమాల కోసం ఏకంగా 25 కోట్లు డిమాండ్ చేస్తున్నాడట రవితేజ. ఇక రవితేజ గత చిత్రం రావణాసుర బాక్సాఫీస్ దగ్గర భారీ డిజాస్టర్ గా నిలిచింది. అయినా కూడా ఇండస్ట్రీలో రవితేజ క్రేజ్ మాత్రం అస్సలు తగ్గడంలేదు. ఆయనతో సినిమాలు చేయ డానికి నిర్మాతలు క్యూ కడుతున్నారు. అంత భారీ ఫ్లాప్ తరువాత కూడా ఈ రేంజ్‌లో రెమ్యూనరేషన్ డిమాండ్ చేయడం, దానికి మేకర్స్ కూడా ఒప్పుకోవడం అంటే మామూలు విషయం కాదు. ఈ రెండు సినిమాలు కూడా హిట్ అయితే.. రవితేజ క్రేజ్ పాన్ ఇండియా లెవల్ కు చేరడం ఖాయం.

# దహాద్..అద్భుతంగా చేసి సోనాక్షి

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ సోనాక్షి సిన్హా లేటెస్ట్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'దహాద్'.ట్రైలర్ తోనే మంచి హైప్ క్రియేట్ చేసిన ఈ సిరీస్ మొదటి సీజన్ మే 12న అమెజాన్ ప్రైమ్ లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక ఈ సిరీస్ కి ప్రేక్షకుల



నుండి మంచి స్పందన వస్తోంది. రాజస్థాన్ లోని మందువలో వరుస హత్యలు జరుగుతూ ఉంటాయి. అది కూడా పబ్లిక్ టాయిలెట్స్ లో. ఈ కేసు పోలీసులకి తలనొప్పిగా మారుతుంది. ముందుగా ఈ మరణాలను ఆత్మహత్యలుగా భావిస్తారు కానీ.. తరువాత దీని వెనుక ఒక సీరియల్ కిల్లర్ ఉన్నాడని తెలుస్తుంది. ఈ కేసును ఛేదించడానికి సబ్ ఇన్స్పెక్టర్ అంజలి భాటి(సోనాక్షి సిన్హా) రంగంలోకి దిగుతుంది. మరి ఆ మరణాలు నిజంగా ఆత్మహత్యలేనా? కాకపోతే వారిని ఎవరు ఎందుకు చంపుతున్నారు అనేది మిగిలిన కథ. నటీనటుల విషయానికి వస్తే సబ్ ఇన్స్పెక్టర్ అంజలి భాటిగా సోనాక్షి సిన్హా అద్భుతమైన నటనని కనబరిచింది. అంత దారుణమైన హత్య కేసుని ఛేదించే పోలీస్ పాత్రలో ఆమె ఒదిగిపోయింది. ఇక మరో ముఖ్య పాత్రలో విజయ్ వర్మ నటించాడు. ఆయన పాత్ర కూడా ఈ సిరీస్ లో చాలా కీలకం. అమాయకుడైన ఉపాధ్యాయుడి పాత్రలో నెక్స్ట్ లెవల్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడు విజయ్ వర్మ.ఇక మిగతా వారు తమ పాత్రకి న్యాయం చేశారు. దర్శకులు రీమా కగ్తీ మరియు జోయా అక్తర్ కథని నడిపిన తీరు అద్భుతం అని చెప్పాలి. నిజానికి ఇది ఒక సీరియల్ కిల్లర్ కథ.

కానీ ఆ కథని నడిపించిన తీరు, అందులో వచ్చే ట్విస్ట్లు ఆడియన్స్ ని మెస్మరైజ్ చేస్తాయి. మొత్తం 8 ఎపిసోడ్స్ ఉన్న ఈ సిరీస్.. ఆధ్యాంతం అలరిస్తుంది. కథనం అంత గ్రిప్పింగ్ గా ఉంటుంది. నెక్స్ట్ ఎం జరుగుతుంది అనే ఉత్కంఠని రేకెత్తించడంలో దర్శకులు సూపర్ సక్సెస్ అయ్యారు. రివ్యూ రేటింగ్ లో 4 పాయింట్స్ సాధించిన ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ లో హిందీలో ఉంది వీలుంటే మీరు ఒక లుక్కేయండి ఖచ్చితంగా నచ్చుతుంది.

# సింహాద్రి రీ రిలీజ్‌కు ప్లాన్

## ఎన్టీఆర్ ఫ్యాన్స్ రచ్చ

యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ రచ్చ రచ్చ చేస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాలో దుమ్ము రేపుతున్నారు. ఎక్కడ చూసినా ఒకటే పేరు ఎన్టీఆర్, ఎన్టీఆర్, ఎన్టీఆర్. ఈ హంగామా చూసిన మిగతా హీరోల ఫ్యాన్స్ ఈ క్రేజ్ ఏంటి సామీ అని అవాక్కవుతున్నారు. మే 20 ఎన్టీఆర్ బర్త్ డే కావడంతో.. సోషల్ మీడియాలో ఎన్టీఆర్ హాష్ ట్యాగ్ ని ట్రెండ్ చేస్తున్నారు. ఎన్టీఆర్ ఫోటోస్, వీడియోస్ ఇలా ఎదో ఒకటి ట్రెండ్ చేస్తూ మే నెల మొత్తం సోషల్ మీడియాని కబ్జా చేసేసారు. ఈ రచ్చని రెట్టింపు చేస్తూ.. సింహాద్రి సినిమాని రీరిలీజ్ ను కూడా ప్లాన్ చేశారు. ఇక ఇప్పటివరకూ ఏ రీరిలీజ్ మెయింటైన్ చెయ్యనంత హైప్ ని సొంతం చేసుకుంది ఈ సినిమా. ఎన్టీఆర్, రాజమౌళి కాంబినేషన్ నుంచి వచ్చిన ఈ మూవీ మాస్ ఫీస్ట్ ని మళ్లీ థియేటర్ లో ఎంజాయ్ చెయ్యడానికి ఫాన్స్ రెడీ అయ్యారు. కేవలం ఓవర్సీస్ లోనే 100 స్క్రీన్ లో సింహాద్రి రీరిలీజ్ అవుతుంది అంటే.. క్రేజ్ ఏ రేంజ్ లో ఉందో అర్ధం చేసుకోవచ్చు. సింహాద్రి రీరిలీజ్ కి ఇంకా వారం సమయం ఉంది. కానీ.. ఈలోపే బుకింగ్స్ ఓపెన్ అవ్వడం, కంప్లీట్ అవ్వడం కూడా జరిగిపోయింది. మరీ ముఖ్యంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో సింహాద్రి రీరిలీజ్ కోసం ఏర్పాటు చేసిన ఆరు షోస్ ఇప్పటికే హౌజ్ ఫుల్స్ అయిపోయాయి. దీంతో.. ఈ సినిమా రీరిలీజ్ కలెక్షన్స్ లో కొత్త రికార్డ్స్ క్రియేట్ చేయడం ఖాయం అని ట్రేడ్ వర్గాల నుండి వినిపిస్తున్న మాట. మరి ఎన్టీఆర్ ఫాన్స్ క్రియేట్ చెయ్యబోయే కొత్త బాక్సాఫీస్ రికార్డ్స్ ఏ స్థాయిలో ఉంటాయో చూడాలంటే మే 20 వరకు ఆగాల్సిందే.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO , RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com